ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తిరుపతి

జిల్లా వార్తలు

సోమవారం 9 జూన్ 2025



భక్తజనసంద్రం.. ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. వారాంతపు, వేసవి సెలవులు రావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచీ భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28వేల మంది దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 663 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,046, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,761 మంది దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,878 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,391, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 471, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 310, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 138 మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,473 విక్రయించినట్టు అధికారులు తెలిపారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



తెప్పలపై సుందరరాజస్వామి రాజసం

తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి తెప్పోత్సవాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజస్వామి పద్మసరోవరంలో తెప్పపై విహరించారు. సాయంత్రం 6.30 గంటలకు ఉత్సవర్లను పద్మపుష్కరిణి వద్దకు వేంచేపు చేసి తెప్పపై కొలువు దీర్చారు. మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ ఉభయదేవేరిలతో స్వామివారు పద్మపుష్కరిణిలో మూడు చుట్లు తిరిగి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్ నాయుడు, అర్చకులు పాల్గొన్నారు.



- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



రద్దీగా తిరుపతి రైల్వే స్టేషన్

తిరుమలకు వచ్చే భక్తులు.. వేసవి రద్దీ కలిపి తిరుపతి రైల్వే స్టేషన్ ప్రాంగణం, సాధారణ విశ్రాంతి హాలులో ప్రయాణికుల సందడి ఎక్కువైంది. రోజువారీగా తిరుపతి మీదుగా 90 రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక, తిరుమలకు పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా తిరుపతి మీదుగా నెలకు 60 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నా రద్దీ తగ్గడంలేదు. అన్ని రైళ్లలో సామర్థ్యం కంటే మించి.. వెయిటింగ్ లిస్టులో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో అదనపు కోచ్‌లు ఏర్పాటు చేస్తున్నామని అధికార వర్గాలు వెల్లడించాయి.

- తిరుపతి(సెంట్రల్), ఆంధ్రజ్యోతి

మన ఆణిముత్యాలు



ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా యూజీ కోర్సుల్లో ప్రవేశాలకోసం నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ ఫలితాలు ఆదివారం సాయంత్రం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలు ప్రైవేటు జూనియర్ కళాశాలల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. జిల్లాకు గర్వకారణంగా నిలిచారు.

- తిరుపతి(విద్య)

● ఏపీ ఈఏపీసెట్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

ఐఐటీ ముంబైలో చదువుతా

తిరుపతి ఎస్వీ నగర్‌కు చెందిన కెమిస్ట్రీ అధ్యాపకుడు కె.నాదమునిరెడ్డి, ఎం.బిందు దంపతుల కుమార్తె కళత్తూర్ యశ్విత ఈఏపీ సెట్‌లో 69వ ర్యాంకు సాధించారు. తిరుపతి నారాయణ కళాశాలలో ఇంటర్ చదివిన ఈమె జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయి ర్యాంకు 1535, ఈడబ్ల్యుఎస్‌లో 122వ ర్యాంకు, అడ్వాన్స్‌డ్‌లో ఓపెన్ కేటగిరీలో 906వ ర్యాంకు, ఈడబ్ల్యుఎస్ కేటగిరీలో 67వ ర్యాంకు పొందారు. ముంబై ఐఐటీలో సీఎస్ఈ చదవాలనేది తన ఆశయమని, ఆమేరకు జేఈఈ ద్వారా చేరనున్నట్లు చెప్పారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌లో రీసెర్చ్

తిరుపతి ఎం.ఆర్.పల్లె అమరావతి నగర్‌కు చెందిన ప్రైవేట్ అధ్యాపకుడు (గణితం) ఎం.జైభారత్‌రెడ్డి, ప్రైవేట్ ఉపాధ్యాయురాలు సురేఖ దంపతుల కుమారుడు మాండవ్యపురం భానుచరణ్‌రెడ్డి తిరుపతి నారాయణ కళాశాలలో ఇంటర్ చదివారు. ఏపీ ఈఏపీ సెట్‌లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించిన ఇతడు.. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఓపెన్ కేటగిరీలో జాతీయ స్థాయిలో 51వ ర్యాంకు, ఈడబ్ల్యుఎస్ కేటగిరీలో జాతీయ స్థాయిలో 4వ ర్యాంకు, జేఈఈ మెయిన్స్‌లో ఓపెన్ ర్యాంకు 158, ఈడబ్ల్యుఎస్‌లో 7, జేఈఈ బీఆర్క్‌లో ఓపెన్ కేటగిరీలో 54, ఈడబ్ల్యుఎస్‌లో 3వ ర్యాంకు సాధించారు. ముంబై ఐఐటీలో బీటెక్ చదివి, ఆ తర్వాత క్వాంటమ్ కంప్యూటింగ్‌లో రీసెర్చ్ చేయాలన్నది తన ఆశయమని భానుచరణ్‌రెడ్డి తెలిపారు.

న్యూఢిల్లీ ఎయిమ్స్‌లో మెడిసిన్

తిరుపతిలోని ఆర్థో డాక్టర్ కిరణ్, ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ శైలజ దంపతుల కుమారుడు ఒ.ఆరుష్ లక్ష్మణ్ ఈఏపీ సెట్ మెడికల్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 45వ ర్యాంకు సాధించారు. తిరుపతిలోని శ్రీచైతన్యలో ఇంటర్ చదివిన ఈయన.. న్యూఢిల్లీలోని ఆలిండియా మెడికల్ సైన్సెస్‌లో మెడిసిన్ చదవాలన్నది తన ఆశయమని చెప్పారు. అందుకోసమే నీట్ రాశానని, ఆ ఫలితాలు వెలువడిన తర్వాత తదుపరి కార్యాచరణను రూపొందించుకుంటానని ఆరుష్ తెలిపారు.

టాప్ 7 ఐఐటీల్లో బీటెక్

శ్రీకాళహస్తిలో సబ్‌ట్రెజరరీ అధికారిగా పనిచేసే, ఎం.ఆర్.పల్లెకు చెందిన సి.వెంకటరమణ, ప్రభుత్వ టీచరు సి.విజయ దంపతుల కుమారుడు బీవీ ధనుష్ ఏపీ ఈఏపీ సెట్‌లో 59వ ర్యాంకు సాధించారు. తిరుపతి నారాయణ కళాశాలలో ఇంటర్ చదివిన ఇతడు జేఈఈ మెయిన్స్‌లో 466 ర్యాంకు, అడ్వాన్స్‌డ్‌లో 1208 ర్యాంకు పొందాడు. టాప్ 7 ఐఐటీల్లో బీటెక్ సీఎస్ఈ చదవాలన్నది తన కోరిక అని, వాటిల్లో సీటు కోసం ప్రయత్నిస్తానని ధనుష్ చెప్పారు.

ఎస్వీ మెడికల్ కళాశాలలో మెడిసిన్

తిరుపతి అమరావతినగర్‌లోని హేమంత్‌కుమార్ (చంద్రగిరి హెడ్ పోస్టాఫీస్ పోస్టల్ అసిస్టెంట్), శ్రీలత దంపతుల కుమార్తె ఎ.మౌనిక నారాయణ కళాశాలలో ఇంటర్ చదివారు. ఈఏపీ సెట్ మెడికల్ విభాగంలో 94వ ర్యాంకు సాధించారు. నాన్న డాక్టర్ అవ్వాలనుకున్నప్పటికీ పరిస్థితుల కారణంగా కాలేకపోయారని, దీనిని వింటున్న తనలో డాక్టర్ కావాలనే పట్టుదల పెరిగిందని ఆమె చెప్పారు. ఆమేరకు తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో మెడిసిన్ చదువుతానని చెప్పారు. తాను ఇటీవల నీట్ రాశానని, అందులో మంచి ర్యాంకు వచ్చినప్పటికీ తిరుపతిలోనే చదవాలనుకుంటున్నట్టు మౌనిక వెల్లడించారు.



భానుచరణ్‌రెడ్డి | మణిదీప్‌రెడ్డి | బీవీ ధనుష్ | యశ్విత | ఒ. ఆరుష్ లక్ష్మణ్ | ఎ.మౌనిక

ఇంజినీరింగ్ విభాగంలో అగ్రగణ్యులు

తిరుపతికి చెందిన భానుచరణ్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించి జిల్లాలో అగ్రగణ్యుడిగా నిలిచారు. అలాగే మణిదీప్‌రెడ్డి 7వ ర్యాంకు సాధించి జిల్లాలో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. ఆరుష్ లక్ష్మణ్ 45, ధనుష్ 59, యశ్విత 69వ ర్యాంకుతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఇక, అరుణ్‌కుమార్ రెడ్డి 125, యశ్వంత్ 135, లావణ్య 230, లక్ష్మీసహస్ర 322, జెశ్విత 398, జాశ్విత 444, శివకృతిక్ 492 ర్యాంకులు సాధించారు. వీరిలో కొందరికి జేఈఈలోనూ మంచి ర్యాంకులు వచ్చాయి.

● బైపీసీ విభాగంలో తిరుపతికి చెందిన ఒ.ఆరుష్ లక్ష్మణ్ రాష్ట్రస్థాయిలో 45, చంద్రగిరికి చెందిన మౌనిక 94వ ర్యాంకు సాధించి జిల్లా టాపర్లుగా నిలిచారు.

ఖరగ్‌పూర్ ఐఐటీలో సీఎస్ఈ

తిరుపతి విద్యానగర్ గౌతం నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గిరిజాప్రసాద్‌రెడ్డి, అగ్రికల్చరల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ అమరావతి దంపతుల కుమారుడు దేశిరెడ్డి మణిదీప్‌రెడ్డి ఈఏపీసెట్ ఇంజినీరింగ్ విభాగంలో 7వ ర్యాంకు సాధించారు. తిరుపతి నారాయణ కళాశాలలో ఇంటర్ చదివారు. జేఈఈ మెయిన్స్‌లో 274, అడ్వాన్స్‌డ్‌లో జాతీయ స్థాయిలో 345వ ర్యాంకు సాధించాడు. జేఈఈ ర్యాంకు ద్వారా ఖరగ్‌పూర్ ఐఐటీలో సీఎస్ఈ చదవాలన్నది తన ఆశయమని మణిదీప్‌రెడ్డి చెప్పారు.



పరిశ్రమకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

'దమ్ము బయోఫ్యూయల్స్'కు భూమిపూజ

పెళ్లకూరు,జూన్8(ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం పాలచ్చూరులో ఆదివారం దమ్ము బయోఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు ఎమ్మెల్యే భూమి నెలవల విజయశ్రీ భూమిపూజ చేశారు. 22.49 ఎకరాల్లో రూ.229.82 కోట్లతో 200 కేఎల్‌పీడీ (100 శాతం ఇథనాల్) ధాన్యం ఆధారిత డిస్టలరీ యూనిట్ ఏర్పాటుతో సుమారు 300 మందికి ఉద్యోగావకాశాలు కలుగుతాయన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ సహాయ సహకారాలతో రాష్ట్రంలో భారీగా పరిశ్రమలు ఏర్పాటు కావడం శుభపరిణామన్నారు.ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు దమ్ము కిషోర్‌బాబు, గ్రేస్ రాజా, టీడీపీ నేతలు పార్థసారథి, కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, అక్కురపల్లి మాధవరెడ్డి, కాటంరెడ్డి మల్లికార్జునరెడ్డి, మదన్‌మోహన్‌నాయుడు, సిద్దులయ్యనాయుడు, కృష్ణమనాయుడు, పెంచలయ్య పాల్గొన్నారు.

వారిపై కేసు నమోదు చేయండి

● అమరావతి మహిళలను కించపరిచినవారిపై ఎస్పీకి టీడీపీ నేతల ఫిర్యాదు

తిరుపతి, జూన్8(ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళ లను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన.. చేయించిన వారిపై కేసులు నమోదు చేయాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏపీజీబీసీ చైర్‌పర్సన్ ఎం.సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ మీడియాతో మాట్లాడారు. ఆంధ్రుల రాజధాని అమరావతిపై జగన్ టీవీలో జగన్మోహన్ రెడ్డి, భారతి దంపతుల ప్రోద్బలం లేకుండా ఇలాంటి నీచమైన చర్చాగోష్ఠి జరగదన్నారు. దీనిపై జగన్ వెంటనే రాష్ట్ర ప్రజలకు, మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండు చేశారు. జర్నలిస్టుల ముసుగులో ఉన్న సంస్కారహీనులు, కిరాయి బ్యాచ్ మహిళలను కించపరుస్తూ చేసిన నీచపు వ్యాఖ్యలు మహిళల వ్యక్తిత్వం మీద దాడిగా చూస్తున్నారన్నారు. జగన్ రెడ్డి కుంభకోణాలపై ప్రజల దృష్టి మళ్లించేందుకే అమరావతిపై దుర్మార్గపు దాడి చేయించారని, స్వార్థ రాజకీయం కోసం ఇంత నీచానికి దిగజారిన జగన్ వైఖరిని ప్రజలు, మేధావులు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని పిలుపునిచ్చారు. వీరిపై మహిళా కమిషన్, ఎస్సీ కమిషన్, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీని కలిసినవారిలో నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, నాయకులు పులుగోరు మురళీకృష్ణారెడ్డి, కుమారమ్మ, దంపూరి భాస్కర్, మన్నెం శ్రీనివాసులు, చినబాబు, పాటకం వెంకటేష్, కార్పొరేటర్ అన్నా అనిత, మునిశేఖర్ రాయల్, ఆముదాల తులసీరాం, కొట్టే హేమంత్ రాయల్, కంకణాల రజనీకాంత్, రామారావు తదితరులున్నారు.



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు సుగుణమ్మ, నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ తదితరులు

మామిడి రైతుకు లభించని 'మద్దతు'



● కిలో రూ.8కి ముందుకొచ్చింది 5 ఫ్యాక్టరీలు
● రూ.ఏడు వద్దే ఆగిన మిగిలిన యాజమాన్యాలు
● సంప్రదింపులు జరుపుతున్న అధికారులు

చిత్తూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతుకు ఇంకా మద్దతు ధర లభించలేదు. తోతాపురికి కిలో రూ.12 చొప్పున అధికారులు మద్దతు ధర ప్రకటించిన విషయం తెలిసిందే. ఇది తమకు గిట్టుబాటు కాదని పల్ప్ ఫ్యాక్టరీలు చెప్పాయి. ఇక, రాష్ట్ర ప్రభుత్వం కిలోపై రూ.నాలుగు రాయితీ ప్రకటించింది. దీంతో పల్ప్ ఫ్యాక్టరీలు రూ.8 ఇస్తే.. రాయితో కలిపి రైతులకు రూ.12 మద్దతు ధర లభిస్తుంది. చిత్తూరులో 35, తిరుపతి జిల్లాలో 5 చొప్పున 40 పల్ప్ ఫ్యాక్టరీలున్నాయి. ఇక, ర్యాంపులలోనూ మామిడి కాయలు కొంటుంటారు. కాగా, చిత్తూరు జిల్లా పరిధిలోని ఐదు ఫ్యాక్టరీల యాజమాన్యాలు మాత్రం రూ.8 చొప్పున చెల్లించేందుకు ముందుకురాగా, మిగతావి రూ.ఏడు వద్దే ఆగాయి. వీరితో సంప్రదిస్తున్నామని, మరో నాలుగు రోజుల్లో మద్దతు ధర అమలయ్యేలా చూస్తామని అధికారులు చెబుతున్నారు. ఈనెల 10 నుంచి జిల్లాలోని అన్ని ఫ్యాక్టరీలు తెరచుకునేలా, మద్దతు ధరను ఇచ్చేలా అధికారులు సిద్ధం చేశారు. మరోవైపు తమిళనాడులోని కృష్ణగిరి ఫ్యాక్టరీల్లో కిలో మామిడి రూ.5 నుంచి రూ.6 మధ్యలో అమ్ముడుబోతోంది. మన ప్రభుత్వం రూ.4 సబ్సిడీని ప్రకటించిన నేపథ్యంలో అక్కడి కలెక్టర్ కూడా తమిళనాడు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా.. వారి నుంచి స్పందన లేదు. దీంతో అక్కడి రైతులు మన జిల్లాకు మామిడి కాయల్ని తెచ్చేస్తున్నారు. ఈ క్రమంలో ఆ కాయలు రాకుండా సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘా పెంచాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కాగా, ఫ్యాక్టరీల్లో 2023, 2024లలో తయారుచేసిన సుమారు 40వేల టన్నుల పల్ప్ అలాగే ఉండిపోయిందని యాజమాన్యాలు చెబుతున్నాయి. పల్ప్ కొనుగోలు చేసిన కంపెనీల నుంచీ బిల్లులు పెండింగులో ఉన్నాయని, దీంతో మామిడి కాయలను కొనే పరిస్థితి లేదంటున్నారు.

12నుంచి క్రషింగ్ మొదలుపెట్టాలి

● లేదంటే రైతుల ఆగ్రహాన్ని చవిచూస్తారు
● పల్ప్ ఫ్యాక్టరీలకు మామిడి ధరల స్థిరీకరణ కమిటీ హెచ్చరిక

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పల్ప్ ఫ్యాక్టరీలు ఈనెల 12వ తేదీనుంచి పూర్తిస్థాయిలో క్రషింగ్ మొదలుపెట్టకుంటే రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని మామిడి ధరల స్థిరీకరణ కమిటీ హెచ్చరించింది. ఆదివారం చిత్తూరులో రైతు త్యాగరాజరెడ్డి అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ప్రభుత్వం తోతాపురి కిలోకు రూ.4 ప్రోత్సాహకం అందజేస్తున్న తరుణంలో రైతులకు రూ.12 గిట్టుబాటు ధర చెల్లించాలని కమిటీ పునరుద్ఘాటించింది. కన్వీనర్లు ఆనంద నాయుడు, టి.జనార్దన్ తదితరులు మాట్లాడుతూ.. తోతాపురి మామిడి పక్వానికి వచ్చినా పొరుగురాష్ట్రాల నుంచి చౌకగా పొందేందుకోసం పల్ప్ ఫ్యాక్టరీలవారు ఇప్పటికీ క్రషింగ్ మొదలుపెట్టలేదని విమర్శించారు. పొరుగు రాష్ట్రాల నుంచి కాయలు రాకుండా రైతులు సైతం ఎక్కడికక్కడ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా యంత్రాంగమూ కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలు పాటించని ఫ్యాక్టరీల లైసెన్సులు రద్దు చేయాలన్నారు. రైతు నాయకులు హరిబాబు చౌదరి, భారతి తదితరులు మాట్లాడుతూ ప్రతి ఫ్యాక్టరీ ధరల పట్టిక ప్రదర్శించాలన్నారు. ఫ్యాక్టరీకి తెచ్చిన కాయలను మూడు గంటల్లోగా అన్‌లోడింగ్ చేసేలా చూడాలని కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయాలని కమిటీ తీర్మానించింది.

తోక జాడిస్తే కత్తిరిస్తాం

- అకతాయిలు, రౌడీలకు డీఎస్పీ హెచ్చరిక
- కూరగాయల మార్కెట్‌లో కార్డెన్ సెర్చ్



తిరుపతి కూరగాయల మార్కెట్‌లో పోలీసుల కార్డెన్ సెర్చ్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని తోక జాడిస్తే కట్ చేస్తామని రౌడీలు, ఆకతాయిలను డీఎస్పీ భక్తవత్సలం హెచ్చరించారు. శుక్రవారం తిరుపతి కూరగాయల మార్కెట్‌లో మత్తు ఇంజెక్షన్ల కలకలం అంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వీడియోలు వైరల్ కావడంతో ఎస్పీ హర్షవర్ధనరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించి.. మొత్తం ఫేక్ అని తేల్చడం తెలిసిందే. ఈ క్రమంలో ఎస్పీ ఆదేశాలతో ఆదివారం తెల్లవారుజామున డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యాన సీఐలు శ్రీనివాసులు, రామయ్య, మురళీమోహన్, రాంకిషోర్, ఎస్‌ఐలు, పోలీసులు కూరగాయల మార్కెట్‌కు చేరుకున్నారు. కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అడుగడుగునా తనిఖీలు చేసి.. అనుమానమున్న వారి వివరాలు తెలుసుకున్నారు. కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ రెండు రోజుల కిందట మార్కెట్‌వాసులు ఎస్పీకి చెప్పారు. దీంతో మార్కెట్‌లోని ఐదు కీలక ప్రాంతాల్లో సోలార్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. త్వరలో మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మొత్తం మార్కెట్‌ను సీసీ నిఘాలో ఉంచుతామని డీఎస్పీ భకవత్సలం చెప్పారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు తెలిస్తే డయల్ 112కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఫోర్జరీ డాక్యుమెంట్లతో ఆస్తి కాజేసి..

- నిందితుడి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి ఇతరుల ఆస్తి కాజేస్తున్న నిందితుడ్ని తిరుపతి రూరల్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వివిధ ఫోర్జరీ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. చంద్రగిరి మండలం గంగుడుపల్లెకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కామసాని మునిరత్నంరెడ్డి.. చెన్నైలో ఉంటున్నారు. ఈయన శ్రీనివాస హౌసింగ్ సొసైటీలో శారద పేరుతో ఉన్న ప్లాట్ నెంబరు 302ను.. ఆమె సంతకం ఫోర్జరీ చేసి ఇద్దరితో కలిసి అవినాష్‌రెడ్డికి రూ.86 లక్షలకు విక్రయించాడు. అలాగే వేదిక్ అపార్టుమెంటులో ఇప్పటికే ఇతరులకు విక్రయించిన ఒక ప్లాట్‌ను మళ్లీ మరొకరికి లీజుకు ఇవ్వడం ద్వారా డబుల్ లావాదేవీలు చేశాడు. దీంతో పాటు తిరుపతికి చెందిన రాజకుమారి వద్ద రూ.30 లక్షలు తీసుకుని, ఆమెకు సంబంధించిన భూమిని తన భార్య పేరుతో రిజిస్టర్ చేసుకున్నాడు. అదే భూమిని మళ్లీ మూడో వ్యక్తికి విక్రయించాడు. ఇప్పటికే పలు కోర్టుల్లో నకిలీ ఒప్పంద పత్రాలు, నకిలీ అఫిడవిట్లు, ఫేక్ సంతకాలుచేసి విచారణను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశాడు. దీంతో పాటు ఒరిజనల్ డాక్యుమెంట్లు కలిగిన బాధితుల నుంచి పత్రాలు తీసుకున్న తర్వాత వాటిని తన ప్రయోజనార్థం ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్లు చేస్తున్నాడు. వీటన్నింటిపై బాధితుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అతడి కోసం కొంత కాలంగా రూరల్ పోలీసులు గాలించారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి నాయుడుపేట సమీపంలో అరెస్టు చేశారు. అతడి నుంచి డాక్యుమెంట్లు, సెల్‌ఫోన్, డిజిటల్ ఆధారాలు స్వాధీనం చేసుకుని.. రిమాండ్‌కు పంపినట్లు సీఐ చెప్పారు.

- మహిళల అక్రమ రవాణా కేసులో

నిందితుల ఆచూకీ తెలపండి

తిరుపతిలోని ఎస్వీయూ పోలీసు స్టేషన్ సీఐ విజ్ఞప్తి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో 2012లో మహిళలను అక్రమంగా తీసుకొచ్చి వ్యభిచార కూపంలో దింపిన ఇద్దరు నిందితుల ఆచూకీ తెలపాలని సీఐ రామయ్య ఆదివారం విజ్ఞప్తి చేశారు. ఈ కేసులో రాజమహేంద్రవరంలోని హౌసింగ్ కాలనీ, లాలాచెరువుకు చెందిన పి.నాగదేవి, రాజమండ్రి తాడితోట వీధికి చెందిన కె.సునీత నిందితులుగా ఉన్నారన్నారు. వీరిపై క్రైం నెంబరు 14-2003 మేరకు పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. వీరిని తిరుపతిలోని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచాల్సి ఉండగా, కొన్నేళ్లుగా తప్పించుకుని తిరుగుతున్నారన్నారు. వీరి ఆచూకీ తెలిసిన వారు వెంటనే ఎస్వీయూ వర్సిటీ సీఐ 94910 74524కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సీఐ విజ్ఞప్తి చేశారు. వీరి ఆచూకీ తెలిపిన వారికి తగిన పారితోషికం ఇస్తామని చెప్పారు.

టెన్జింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): టెన్జింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారాలు(జీవితకాల సాఫల్యం)కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి 2023, 2024 సంవత్సరాలలో భూమి, నీటి, గాలిపై సాహస కృత్యాలు చేసి ప్రతిభచాటిన అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. 'అవార్డ్స్‌జీవోవీ.ఇన్' పోర్టల్(ఆన్‌లైన్)లో అర్హులు తమ వివరాలను పొందుపరచాలని సూచించారు. నమోదుకు కాలపరిమితి ఈనెల 30వతేదీ సాయంత్రం 6గంటల వరకు అవకాశం ఉందన్నారు.

గరిమెళ్ల రాధ మృతి



తిరుపతి, జూన్8(ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ సంగీత కళాకారుడు, టీటీడీ ఆస్థాన విద్వాంసుడు దివంగత గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ సతీమణి రాధ ఆదివారం మృతి చెందారు. మూడు నెలల క్రితం గరిమెళ్ల అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. అనతికాలంలోనే ఆమె కన్నుమూయడంతో గరిమెళ్ల కుటుంబ సభ్యులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

నేటి నుంచి వేరుశనగ విత్తనకాయల పంపిణీ

పాకాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతుసేవా కేంద్రాల్లో సోమవారం నుంచి సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారిణి పుష్పావతి తెలిపారు. 919.8 క్వింటాళ్ల వేరుశనగ, 5 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. కే6 వేరుశనగ 30 కిలోల బస్తా రూ.1,674, 10 కిలోల జీలుగ విత్తనాలు రూ.615, పీఎం డీఎస్ 10 కిలోల కిట్ రూ.650 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, 1బి తీసుకొచ్చి రైతుసేవా కేంద్రాలలో బయోమెట్రిక్ వేసి తీసుకోవాలన్నారు.

సాగులో ఆధునిక శాస్త్రీయతపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చంద్రగిరి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కొంగరవారిపల్లె, ఐతేపల్లె గ్రామాల్లో ఆదివారం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా పంట సాగులో ఆధునిక శాస్త్రీయతపై రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని పంటల సాగులో అనుసరించాల్సిన ఆధునిక పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. పంట ఉత్పత్తి, ఆరోగ్యం, వనరుల నిర్వహణ మెరుగుపరచడంపై దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా భూసార పరీక్ష ఫలితాలను అనుసరించి ఎరువులు వినియోగించుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి శశిధర్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న సబ్సిడీ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో క్రీడా శాస్త్రవేత్త భరత్‌కుమార్, ఉద్యాన సహాయకురాలు పవిత్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నృత్యం ముగ్ధమనోహరం



తిరుచానూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నృత్య ప్రదర్శన ముగ్ధమనోహరంగా సాగింది. చెన్నైకు చెందిన శక్తిలయ నాట్యపల్లి కేంద్రానికి చెందిన కళాకారులు హర్షిత, రితిక, అక్షరశ్రీ, సాగశ్రీ, మధుశ్రీ, అనుశ్రీ, లక్షికా, జోష్న, మేఘ, ప్రతీక్ష తదితర కళాకారులు మలై మాత్రిన, మురగన్ గౌతగం, కాక్కై సిరగినిలే, నాన్ ఒరు విళైయాట్టు, బొమ్మాయ్య, భో శంభో వంటి కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. వారికి ఏవో సుధాకర్ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

చిన్నశేష, హంస వాహనాలపై

ప్రసన్న వేంకటేశ్వరస్వామి విహారం



చిన్న శేష వాహనంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు - హంస వాహనంపై ప్రసన్న వెంకటేశ్వరుడు

వడమాలపేట, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజైన ఆదివారం సాయంత్రం స్వామి చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనాలపై మాడవీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. సాయంత్రం ప్రసన్న వేంకటేశ్వరుడు సర్వాలంకారం భూషితుడై ఐదు తలల చిన్న శేష వాహనంపై మోహనకృష్ణుడి అలంకారంలో మేళతాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులపై వరాల జల్లు కురిపించారు. సాయంత్రం భక్తుల గోవిందనామ స్మరణల నడుమ శ్రీవారి ఊంజల సేవ నిర్వహించారు. రాత్రి హంస వాహనారూఢుడై సరస్వతీదేవి అలంకారంతో భక్తుల గోవిందనామస్మరణ నడుమ మాడవీధుల్లో ఊరేగారు.భక్తులు నారికేళ కర్పూర నీరాజనాలు సమర్పించారు. అప్పలాయగుంట మాడవీధుల్లో ఒకరు కాలం చెందడంతో బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు కార్యక్రమాలను ఆలస్యంగా ప్రారంభించారు. మధ్యాహ్నం తర్వాత మాడవీధులు, ఆలయంలో సంపూర్ణ సంప్రోక్షణ, హోమాధికాలు నిర్వహించి యథాతథంగా ఊంజల సేవ, వాహన సేవలు నిర్వహించారు. ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయాధికారి శివకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, కంకణ భట్టార్ తిప్పయ్యాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి వాహన సేవలు

అప్పలాయగుంటలో మూడోరోజు సోమవారం ఉదయం 8.00 నుంచి 9.00గంటల వరకు సింహ వాహన సేవ, సాయంత్రం 5.00 నుంచి 5.30 గంటల వరకు శ్రీవారి ఊంజల సేవ, రాత్రి 7.00 నుంచి 8.00 వరకు ముత్యపుపందిరి వాహనంపై శ్రీవారు మాడవీధుల్లో విహరించనున్నారు.

లేత జొన్నగడ్డి తిని నాలుగు ఆవులు, రెండు గేదెల మృతి

- పక్వానికి రాకపోవడంతో విషంగా మారిన గడ్డి



తిరుపతిరూరల్, జూన్8(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామంలో పక్వదశకు చేరని లేత జొన్నగడ్డిని దాణాగా తీసుకుని ఆదివారం నాలుగు ఆవులు, రెండు గేదెలు మృతిచెందాయి. బాధితులు చెంచమ్మ, నాగరాజు దంపతుల వివరాల మేరకు.. పొలంలో సాగుచేస్తున్న జొన్నని శనివారం పశువులకు దాణాగా వేశారు. నీరు తాగిన కొంతసేపటికే మృతి చెందాయి. పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ మదన్, స్థానిక వెటర్నరీ డాక్టర్ యోగానంద్ వచ్చి పరిశీలించారు. పక్వానికి రాని (ఇమెచ్యూర్ జోవార్) జొన్నగడ్డిని దాణాగా తీసుకోవడం వల్ల దానిలోని హైడ్రోజన్ సయినైడ్ విషంగా మారి పశువులు మృతిచెందినట్లు నిర్ధారించారు. వీటి విలువ రూ.4.70 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. జొన్నగడ్డి పక్వానికి వచ్చిన తర్వాత, దాన్ని కోసి ఒకరోజు నీడలో ఆరబెట్టాలని, మాగుడు గడ్డిగా మారిన తర్వాతనే దాన్ని పశువులకు దాణాగా వేయాలని సూచించారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగూరు శ్రీనివాసులు ద్వారా సమాచారం తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని బాధిత రైతులతో ఫోన్‌లో మాట్లాడి ఓదార్చారు. కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, రూరల్ తహసీల్దార్ రామాంజులు నాయక్‌తో ఫోన్లో మాట్లాడి వివరించారు. వీటిలో రెండు ఆవులు గర్భం దాల్చి ఉండడంతో సంప్రదాయం ప్రకారం గ్రామస్తుల సమక్షంలో పంచనామా చేసి, గుంతలో పూడ్చిపెట్టారు. వీఆర్వో పుల్లూరు రాఘవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రెడ్డి జ్యోతీశ్వరప్రసాద్ పాల్గొన్నారు.



ప్రమాదాలు నివారించి..రక్షించు స్వామీ..!

భక్తాంజనేయ ఫ్లెక్సీ ఏర్పాటుచేసిన ఎ.రంగంపేట గ్రామస్తులు



ఎ.రంగంపేట గ్రామస్తులు ఏర్పాటు చేసిన భక్తాంజనేయస్వామి ఫ్లెక్సీ

చంద్రగిరి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): 'స్వామీ.. ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా రక్షించు' అంటూ మండలంలోని ఎ.రంగంపేట గ్రామస్తులు నాగయ్యగారిపల్లె వద్ద భక్తాంజనేయస్వామి ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. శ్రీనివాసమంగాపురం నుంచి ఎ.రంగంపేట వరకు పలు విద్యాసంస్థలు ఉండటంతో ఆ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటోంది. పైగా వాహన చోదకులు వేగంగా రాకపోకలు సాగిస్తున్నారు. తద్వారా తిరుపతి, మదనపల్లె జాతీయ రహదారిలో నాగయ్యగారిపల్లె వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఎ.రంగంపేట, పరిసర గ్రామస్తులు ఆ దారిలో ప్రయాణించాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ క్రమంలో ఎ.రంగంపేట గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, భక్తాంజనేయస్వామి బృందం పాదిరి నాగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, భీమారావు, ఎంసీ రాయల్, పళనిస్వామి, గోవర్ధన్ యాదవ్ తదితరులు భక్తాంజనేయస్వామి ఫ్లెక్సీని ఏర్పాటు చేసి, ప్రమాదాలు నివారించాలని మొక్కుకున్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్లగా స్పీడు బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

ఏపీఈఏపీ సెట్‌లో ప్రైవేటు విద్యార్థుల హవా



ఉత్తమ ర్యాంకులు సాధించిన నారాయణ విద్యార్థులతో డీజీఎం కొండలరావు తదితర అధ్యాపకులు



శ్రీచైతన్య విద్యార్థులతో ఏజీఎం బీవీ ప్రసాద్, కేఎల్వీ ప్రసాద్ తదితర అధ్యాపకులు

తిరుపతి(విద్య), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా యూజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఈఏపీ సెట్‌లో తిరుపతిలోని ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు.

నారాయణ విద్యార్థుల హవా

ఏపీ ఈఏపిసెట్‌లో తమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని నారాయణ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు తెలిపారు. ఎంపీసీ విభాగంలో తమ విద్యార్థులు ఎం.భానుచరణ్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు, మణిదీప్‌రెడ్డి 7, ధనుష్ 59, యశ్విత 69 వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని చెప్పారు. పదిలోపు రెండు ర్యాంకులు, 100లోపు నాలుగు, 500లోపు 14, వెయ్యిలోపు 21 ర్యాంకులు సాధించారని, బైపీసీ విభాగంలో మౌనిక రాష్ట్ర స్థాయిలో 94వ ర్యాంకుతోపాటు వెయ్యిలోపు 9 ర్యాంకులు తమ విద్యార్థులు కైవసం చేసుకున్నారని వెల్లడించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కోర్ డీన్ శ్రీనివాసరావు, డీన్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు విజయ్‌కుమార్, చిట్టిబాబు, దుర్గాప్రసాద్, అభిషేక్ ఏజీఎం గోపిచంద్ అభినందించారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ఏపీఈఏపీసెట్‌లో తమ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి ఇంజినీరింగ్, అగ్రికల్చర్ విభాగాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం బీవీ ప్రసాద్ తెలిపారు. తమ విద్యార్థి ఒ.ఆరుష్ లక్ష్మణ్ బైపీసీలో రాష్ట్ర స్థాయిలో 45వ ర్యాంకు, యశ్వంత్ 135, లావణ్య 230, లక్ష్మీ సహస్ర 322, జెస్విత 398, జాశ్విత 444, శివకృతిక్ 492, హర్షవర్ధన్ 528, ఉమేష్ 551, హిమవర్ష 787, రామలక్ష్మమ్మ 799, లక్ష్మి హర్షిత 800, మంజునాథ్ మహర్షి 900, టీనారాణి 919, సాధన 925 వంటి వెయ్యిలోపు టాప్ ర్యాంకులు సాధించారని వివరించారు. 5వేలలోపు 167 మంది విద్యార్థులు, 10వేలలోపు 348 మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు. విద్యార్థులను ఏజీఎంతోపాటు డీన్‌లు కేవిఎల్‌జీ ప్రసాద్, రామమోహన్‌రావు, శ్రీనివాసరాజు, భాస్కర్, ప్రిన్సిపాళ్లు అభినందించారు.

మెడికల్ అకాడమీ విద్యార్థుల విజయం

ఈపీఈఏపీసెట్‌లో తిరుపతి డాక్టర్స్ అకాడమీ, అమరావతి ఐఐటీ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారని ఆ విద్యాసంస్థల చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ పార్థివ్‌రెడ్డి చెప్పారు. ఎంపీసీ విభాగంలో బి. అరుణ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో 125వ ర్యాంకు, కేయూష్ సాయి 731వ ర్యాంకు, రుత్విక్ 751వ ర్యాంకు, సంతోష్ 799, వంశీకృష్ణ 960వ ర్యాంకు సాధించారని వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో వెయ్యిలోపు 5 ర్యాంకులు, 2వేలలోపు 40, 3వేలలోపు 70 ర్యాంకులు తమ విద్యార్థులు సాధించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.



మెడికల్ అకాడమీ విద్యార్థులు

టీడీపీ పద్మావతీపురం గ్రామ కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులను అభినందిస్తున్న గ్రామస్తులు

తిరుచానూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ తిరుపతి రూరల్ మండలం పద్మావతీపురం గ్రామ పంచాయతీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. పార్టీ మండలాధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గణపతినాయుడు నేతృత్వంలో కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఉమాపతి, ప్రధాన కార్యదర్శిగా బాణవరం ముని, కౌశిక్, ఉపాధ్యక్షులుగా వెంకటరమణరాజు, బీసీ సెల్ అధ్యక్షుడిగా నాగూర్ ఆచారి, ఐటీడీపీ అధ్యక్షుడిగా ఎస్ఎస్ నవీన్, మైనార్టీ అధ్యక్షుడిగా అల్లాబక్ష్, ఎస్సీ సెల్ అధ్యక్షురాలిగా మంజుల, తెలుగు మహిళా అధ్యక్షురాలిగా ఎం.రాజేశ్వరి, తెలుగు యువత అధ్యక్షుడిగా మాగేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి, వాణిగౌడ్, కిలారి వెంకటేష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

శ్రీధర్స్ అకాడమీ విద్యార్థుల విజయం



తిరుపతి(విద్య), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని శ్రీధర్స్ అకాడమీ విద్యార్థులు ఈఏపీ సెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని చైర్మన్ మద్దినేని శ్రీధర్ తెలిపారు. ఇంజినీరింగ్, అగ్రి కల్చరల్ విభాగంల్లో వి.మోహిష్ 228వ ర్యాకు, సాయి పార్థివ్ 737 ర్యాంకు, నిఖిలేశ్వర్ 1365, పెన్నిధి 3919, అమృత 4414 ర్యాంకులు సాధించారని చెప్పారు. అలాగే ఈఏపీ సెట్‌కు హాజరైన 110 మంది విద్యార్థులకుగాను 10వేల ర్యాంకులోపు 25 మంది సాధించారని తెలిపారు. ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఆ పాఠశాలలో టీచర్లందరూ బదిలీ

ఎర్రావారిపాలెం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) ; మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీహరి మినహా మిగతా ఉపాధ్యాయులందరూ బదిలీ అయ్యారు. ధర్మినేని జగదీష్ (ఇంగ్లిషు) చంద్రగిరి మండలం దోర్నకంబాల ఎం పీయూపీఎస్‌కు, బొడ్డు వెంకట్రమణ (గణితం) చిన్నగొట్టిగల్లు జిల్లా పరిషత్ పాఠశాలకు, అమరనాథ్ (భౌతికశాస్త్రం) చంద్రగిరి మండలం కొంగరవాండ్లపల్లె జడ్పీహెచ్ఎస్, సదాశివరెడ్డి (హిందీ) పులిచెర్ల మండలం ఎర్రపాపిరెడ్డిగారిపల్లె ఎంపీయూపీఎస్‌కు, వివేకం విజయలక్ష్మీ(సోషల్ స్టడీస్) రొంపిచెర్ల బాయ్స్ జడ్పీహెచ్ఎస్, బి.ప్రభావతి (జీవశాస్త్రం) గాదంకి జడ్పీహెచ్ఎస్), సురేంద్ర (పీఈటీ) పీలేరు మండలం జంగమంపల్లె జడ్పీహెచ్ఎస్‌కు బదిలీ అయ్యారు. వీరందరూ ఆదివారం రిలీవ్ అయ్యారు. ఇన్నిరోజులు కలిసిమెలిసి పని చేసి ఇప్పుడు విడిపోతుండడంతో కొంత భావోద్వేగానికి గురయ్యారు.



జస్టిస్ ఏకె సిక్రీ

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జూన్8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏకె సిక్రీ, ఆర్బీఐ మాజీ డిప్యూటీ గవర్నర్ రబీ శంకర్, అడిషన్ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రాహుల్ పాండే దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఘాట్‌లో అదుపుతప్పిన కారు



తిరుమల, జూన్8(ఆంధ్రజ్యోతి): తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటిఘాట్‌రోడ్డులో 4వ మలుపు వద్ద ఆదివారం సాయంత్రం ఓ కారు అదుపుతప్పింది. చిన్నపాటి గట్టును దాడి మట్టిదిబ్బను ఢీకొని ఆగిపోయింది. తమిళనాడులోని వేలూరుకు చెందిన కుటుంబం సురక్షితంగా బయటపడింది.

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: రూ.3.68 కోట్లు

శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 88,257

తలనీలాలు సమర్పించినవారు: 45,068

తిరుమలలో వరలక్ష్మీ శరత్‌కుమార్



తిరుమల, జూన్8(ఆంధ్రజ్యోతి): సినీనటి వరలక్ష్మీ శరత్‌కుమార్, నికోలయ్ సచ్‌దేవ్ దంపతులు ఆదివారం వేకువజామున సుప్రభాతసేవలో పాల్గొని స్వామి దర్శనం చేసుకున్నారు. దర్శనం అనంతరం వరలక్ష్మీ శరత్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. చాలా సార్లు తాను తిరుమలకు వచ్చానని, తొలిసారిగా భర్తతో కలిసి వచ్చానని తెలిపారు. సచ్‌దేవ్‌కు ఇదే తొలిసారి అన్నారు.అనంతరం నికోలయ్ సచ్‌దేవ్ మాట్లాడుతూ.. తిరుమలలో చాలా ప్రశాంతమైన వాతావరణం ఉందన్నారు.

అరుదైన కట్లపాము



తిరుమల, జూన్8(ఆంధ్రజ్యోతి): శేషాచల అడవుల్లో మాత్రమే కనిపించే అరుదైన నల్లటి కట్లపాము పట్టుబడింది. తిరుమల కల్యాణవేదిక వెనుకభాగంలోని గార్డెన్‌లోకి శనివారం సాయంత్రం ఐదు అడుగుల పొడవైన ఈపాము ప్రవేశించింది. టీటీడీ ఉద్యోగి భాస్కర్ నాయుడు దీనిని పట్టుకుని అడవుల్లో వదిలేశారు. ఇది చాలా విషపూరతమని భాస్కర్‌నాయుడు తెలిపారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సూర్యప్రభ, చంద్రప్రభలపై

గోవిందుడు



తిరుపతి అర్బన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలలో ఎనిమిదవ రోజు ఆదివారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై స్వామివారు తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10గంటలకు ఆలయంలో ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం వేడుకగా నిర్వహించారు. సాయంత్రం ఊయ్యాలలో స్వామివారు భక్తులను కటాక్షించారు. ఊరేగింపు ఉత్సవంలో వివిధరకాల కళాబృందాల ప్రదర్శన రంజింపచేశాయి. ఈ వేడుకల్లో టీటీడీ పెద్దజియ్యంగార్, చిన్నజియ్యంగార్, డిప్యూటీఈవో శాంతి, ఏఈవో మునికృష్ణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్ అవార్డుకు కేజీబీవీ విద్యార్థిని



హెక్షిత

ఎర్రావారిపాలెం, జూన్ 8(ఆంధ్రజ్యోతి); మండలంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థిని హెక్షితశ్రీ షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైందని ప్రిన్సిపాల్ పరిమళ తెలిపారు. సోమవారం తిరుపతిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నట్లు పేర్కొన్నారు. హెక్షితశ్రీని ఉపాధ్యాయులు అభినందించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

రామచంద్రాపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీవీపురం పంచాయతీ బలిజపల్లి గ్రామంలో తిరుపతికి చెందిన ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి, వాసన్ ఐకేర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామం నుంచేగాక చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

23న ఒలంపిక్ రన్



ప్రసన్నకుమార్‌ను సన్మానిస్తున్న ఒలంపిక్ సంఘ ప్రతినిధులు

తిరుపతి(క్రీడలు), జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఒలంపిక్ డేను పురస్కరించుకుని ఈ నెల 23వ తేదీన ఒలంపిక్ రన్ నిర్వహించనున్నట్లు ఒలంపిక్ జిల్లా అధ్యక్షుడు వై.ప్రవీణ్, కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. ఆదివారం ఉదయం చంద్రగిరి మండలం మిట్టపాలెం గ్రామంలోని శ్రీనివాస హోటల్లో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఒలంపిక్ రన్‌ను విజయవంతం చేసేందుకు సహకరించాలని క్రీడా సంఘాలను కోరారు. ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ క్రీడా సంఘాల ఆధ్వర్యంలో త్వరలో ఓ స్పోర్ట్స్ స్కూల్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం ప్రసన్నకుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సాయికుమార్, ఉపాధ్యక్షులు శివప్రసాద్, సహాయ కార్యదర్శి విజయ్‌కుమార్, రత్నాకర్, గోపినాయుడు, శివయ్య, ప్రేమ్, శ్రీధర్, హిమత్ పాల్గొన్నారు.

తిరుపతి రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు

తిరుపతి(సెంట్రల్), జూన్8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఆదివారం తెల్లవారుజామున ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేశారు. వేసవి సెలవుల కారణంగా రైల్వేస్టేషన్ కొన్ని రోజులుగా ప్రయాణికులతో రద్దీగా ఉంటోంది. ఈ క్రమంలో గంజాయి అక్రమ రవాణా జరిగే అవకాశముంటుందనే అనుమానంతో తనిఖీలు చేపట్టారు. పార్సిల్ కార్యాలయం, లగేజీ కేంద్రంతో పాటు ఆరు ప్లాట్‌ఫారాలు, విశ్రాంతి గదులు, రాకపోకలు నిర్వహించే ఎక్స్‌ప్రెస్ రైళ్లను పోలీసులు, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో జీఆర్‌పీ సీఐ ఆశీర్వాదం, ఎస్ఐ ధర్మేంద్ర, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ రాజేంద్ర పాల్గొన్నారు.

'మా భూమిని కాపాడండి'

తిరుపతి(జీవకోన), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామ లెక్క దాఖలా సర్వే నెంబరు 529/4ఏలోని 92 సెంట్ల భూమిని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, రక్షించాలని శంకర్ కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఆ భూమికి సంబంధించి తమ తండ్రి ఎర్రయ్య పేరిట డీకేటీ పట్టా ఉందన్నారు. 22ఏ కింద ఉన్న ఆ భూమిని తొలగించి తమ తల్లి మునెమ్మ పేరిట మార్చి ఆన్‌లైన్‌లో పెట్టాల్సిందిగా ఇటీవల కలెక్టర్‌కు విన్నవించామన్నారు. అది ప్రభుత్వ భూమిగా ఉందని అధికారులు చెప్పడంతో హైకోర్టుకు వెళ్లామని, స్టేటస్‌కో మంజూరు చేసిందని అన్నారు. ఈ క్రమంలో శనివారం తమ భూమిలో సుబ్రహ్మణ్యంనాయుడు, నాగరాజు, వెంకటేష్, మరికొందరు దౌర్జన్యంగా ప్రవేశించి కట్టడం ప్రారంభించారని తెలిపారు. దీనిపై పోలీసులకు సమాచారం అందించామని, వారిపై చర్యలు తీసుకుని భూమిని కాపాడాలని కోరారు.

పేద విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో విద్యార్థులతో రామ్‌ప్రసాద్

తిరుపతి(జీవకోన), జూన్ 8(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల పిల్లలు పలువురు ఉన్నత చదువులు చదివారు. కొందరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా అవతరించారు... మరికొందరు స్టాక్ మార్కెట్ రంగాల్లో స్థిరపడ్డారు. కొన్నేళ్ల తర్వాత ఇప్పుడు వారు తాము చదివిన పాఠశాల వేదికగా కలిశారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లల కోసం క్రెడాయ్ అసోసియేషన్ అధ్యక్షులు రామ్‌ప్రసాద్ 2005-2020 వరకు జీవకోనలో ప్రాథమికోన్నత పాఠశాల నిర్వహించారు. అందులో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు ప్రస్తుతం సాఫ్ట్‌వేర్, స్టాక్ మార్కెట్ రంగాల్లో ఉద్యోగాలు పొంది ఉన్నత శిఖరాలను అధిరోహించారు. దాదాపు 35మంది విద్యార్థులు ఆదివారం జీవకోనలోని గురుకృప విద్యాలయంలో సమావేశమై అలనాటి జ్ఞాపకాలను రాంప్రసాద్‌తో పంచుకున్నారు. నాణ్యమైన విద్య అందించి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడం మంచి ఆశయమని తిరుపతి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజు అన్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు తోసంగి నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు పుష్పవతి, సుధారాణి, సుభాషిణి, మునెమ్మ, క్రెడాయ్ అసోసియేషన్ కార్యదర్శి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్ పసుపులేటికి అభినందన



డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్‌ను అభినందిస్తున్న డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ తదితరులు

తిరుపతి, జూన్8(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి తిరుపతికి వచ్చిన డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్‌ను ఆదివారం టీడీపీ నేతలు సత్కరించారు. నగర డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, టీడీపీ నాయకులు ఊట్ల సురేంద్ర నాయుడు, సుబ్బు యాదవ్, సుధాకర్ రెడ్డి, దేవాచారి, రవితేజ నాయుడు, ధనంజయ, రవి, హేమంత్ నాయకులు పాల్గొన్నారు.

'వైసీపీ అరాచకాలు కొనసాగుతున్నాయ్'

తిరుపతి అర్బన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయినా నగరంలో వైసీపీ అరాచకాలు కొనసాగుతున్నాయని జనసేన నేత కిరణ్‌రాయల్ విమర్శించారు. తిరుపతి పవిత్రతకు భంగం కలిగించేలా వీడియోలు క్రియేట్ చేసి సామాజిక మాధ్యమాల్లో వదులుతున్నారని, భూమన అభినయ్‌రెడ్డి అనుచరులు దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఎన్నో అక్రమాలకు, అరాచకాలకు పాల్పడి కోట్ల రూపాయలకు పడగలెత్తారని విమర్శించారు. అభినయ్ ప్రధాన అనుచరుడైన చైతన్యయాదవ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అతని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక వీడియో విడుదల చేశారు.

పేదలకు అన్నదానం, దుస్తుల పంపిణీ



అభయక్షేత్రంలో అన్నదానం చేస్తున్న జనసేన నాయకులు సానె శీనురాయల్

తిరుపతి అర్బన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): జనసేన నాయకుడు సానె శ్రీనురాయల్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రేణిగుంట అభయక్షేత్రంలో 250మందికి అన్నదానం చేశారు. బట్టలు పంపిణీ చేశారు. భైరాగిపట్టెడలోని మనోవికాస కేంద్రంలో 50మందికి అల్పాహారం, భోజనం, డిన్నర్ ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఆర్టీసీ బస్టాండు ముందు అన్నదానం చేశారు. పలు ప్రాంతాల్లో ఆయన మిత్రులు, అభిమానులు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ వేడుకల్లో ఆయన మిత్రులు శేఖర్, శివ, చిన్నశేఖర్, ఉదయ్, ప్రకాష్, బత్తయ్య, నవీన్, లోకేశ్, వెంకటేష్ పాల్గొన్నారు.

తిరుపతి ప్రశాంతతను దెబ్బతీస్తే మూల్యం తప్పదు

- టీడీపీ నేత జేబీ శ్రీనివాస్

తిరుపతి, జూన్8(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో రౌడీలు, గూండాలు, సైకోలకు తావులేదని, అయితే ఇప్పటికీ భూమన బ్యాచ్ కొందరు పాతవాసనతో రెచ్చిపోతున్నారని, అలాంటి వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని టీడీపీ సీనియర్ నేత జేబీ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. తిరుపతిలో మోహనరావు అనే కారు స్పేర్ పార్టుల వ్యాపారి నుంచి వాటాల కోసం వైసీపీ నేత భూమన అభినయ్ అనుచరులు చైతన్య, సాయి, యశ్వంత్‌లు విచక్షణారహితంగా దాడికి దిగి భయాందోళనకు గురిచేశారన్నారు. గతంలో నగరాన్ని గంజాయి, డ్రగ్స్‌కు అడ్డాగా మార్చిన వ్యక్తి అభినయ్ అండ్ కో అని ఆరోపించారు. వారి అనుచరులు ఇంకా సెటిల్మెంట్‌లు చేయడమే పనిగా పెట్టుకున్నారని, ప్రజలు తిరస్కరించినా భూమన, వారి అనుచరుల బుద్ధి మాత్రం మారడం లేదని మండిపడ్డారు. తిరుపతి ప్రశాంతతకు విఘాతం కల్పిస్తే తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు.

పడకేసిన పారిశుధ్యం









తిరుపతి అర్బన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని మధురానగర్‌లో పారిశుధ్యం పడకేసింది. డ్రైనేజీలు వ్యర్థాలతో నిండిపోయాయి. మురుగునీరు పొంగిపొర్లుతోంది. వీధి పొడవునా ప్రవహిస్తూ పాదచారులకు, వాహన దారులకు ఇబ్బందిగా మారింది. దుర్వాసన వెదజల్లుతోంది. ముక్కులు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి. దోమలు విపరీతంగా వృద్ధి చెంది కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పైగా వీధుల్లో చెత్త కూడా రోజూ తొలగించడం లేదు. తద్వారా మామిడి, అరటి పండ్ల తొక్కలు కుళ్లి ఈగలకు ఆవాసాలుగా మారుతున్నాయి. పారిశుధ్య విభాగానికి ఫిర్యాదు చేసినా, స్పందనలో అర్జీల ద్వారా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.







చదరంగంలో ప్రతిభ



చెస్ పోటీలలో పాల్గొన్న బాలబాలికలు

తిరుపతి(క్రీడలు), జూన్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన చెస్ ఓపెన్ పోటీలలో క్రీడాకారులు ప్రతిభచాటారు. వివిధ విభాగాలలో 186మంది బాలబాలికలు ప్రాతినిధ్యం వహించగా తొలి మూడు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విక్రమ్‌కుమార్‌రెడ్డి, టీటీడీ విద్యాశాఖాధికారి టి.వెంకటసునీల్ పాల్గొని మాట్లాడుతూ చదరంగం ఏకాగ్రతను పెంచుతుందని, మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందని అన్నారు. టోర్నీ డైరెక్టర్లుగా బాలాజీప్రసాద్, చీఫ్ ఆర్బిటర్స్‌గా శ్రీనివాససూరి, సునీత, గాయత్రి, వెంకట అనిల్, ఆదినారాయణరెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు వెంకట్రామన్, పురుషోత్తంరెడ్డి, అంకమనాయుడు, జాలేశ్వరరావు, దామోదరం, సుంకరరెడ్డెప్ప, ముకేష్, నడ్డినారాయణ, రవీంద్ర, వినయలత, ఇమామ్, వెంకటరమణ, అమరేశ్వరి పాల్గొన్నారు.

రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

తిరుపతి(జీవకోన), జూన్ 8(ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయాలని ఓబీసీ విద్యార్థి సంఘ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు టెన్త్‌లో 80శాతానికి పైగా మార్కులు తెచ్చుకున్నప్పటికీ టీటీడీకి సంబంధించిన జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో సీట్లు రావడంలేదని తెలిపారు. ఇందుకు ప్రధాన కారణం ఈడబ్ల్యూఎస్ కోటా ఉండటమేనన్నారు. తక్కువ మార్కులు వచ్చినప్పటికీ అగ్రవర్ణ పేదల పేరుతో ఈడబ్ల్యూఎస్ కోటాతో ఆ విభాగాల్లో సీట్లు పొందుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరమే స్పందించి ఈడబ్ల్యూఎస్ విధానాన్ని రద్దు చేసే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో విజయ్ ఉత్తరాది, వెంకటయాదవ్, సంబరం పాల్గొన్నారు.

మహిళల మండిపాటు

తిరుపతి, జూన్8(ఆంధ్రజ్యోతి) : అమరావతిని వేశ్యల రాజధానిగా, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులతో నిండిన ప్రాంతంగా దిగజారుడు వ్యాఖ్యలు చేసి రాజధాని ప్రాంత మహిళల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసిన జర్నలిస్ట్ కృష్ణంరాజు, వంతపాడిన యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావులను తక్షణం అరెస్టు చేయాలని తిరుపతి కూటమి మహిళలు డిమాండు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ ఆధ్వర్యంలో ఆదివారం పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట మహిళలు వారి చిత్రపటాలపై చెప్పులు, చీపర్లతో కొట్టి నిరసన తెలిపారు. ఆ రోత ఛానల్ సాక్షి ద్వారా నిర్వహించిన ఓ కార్యక్రమంలో జర్నలిస్ట్ అని చెప్పుకునే వైసీపీ అభిమాని కృష్ణంరాజు చేత మాట్లాడించిన మాటలు వెగటు పుట్టిస్తున్నాయన్నారు. ఇందుకు కారణమైన కృష్ణంరాజును, ప్రోత్సహించిన కొమ్మినేనిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సుభాషిణి, సరోజమ్మ, కడియాల భారతి, పోరుమిట్ల రాణి, లక్ష్మి, లలిత, శ్యామల, జ్యోతి, లత పాల్గొన్నారు.



కృష్ణంరాజు, కొమ్మినేని చిత్రాలను చెప్పులు, చీపుర్లతో కొడుతున్న కూటమి మహిళలు

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. శ్రీకన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. ఆర్యవైశ్య సంఘం 14వ సర్వసభ్య సమావేశం కచ్చపి ఆడిటోరియంలో ఆదివారం రాత్రి నిర్వహించారు. ఆర్యవైశ్యులు తమ ఆదాయంలో కొంత సమాజసేవకు ఉపయోగిస్తున్న తీరు అభినందనీయమన్నారు. వాసవీదేవి ఆశీస్సులతో ఆర్యవైశ్యులు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డి.రాఖేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్యవైశ్యలను అన్ని రకాలుగా ఇబ్బంది పెట్టిందన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత తమకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దిండుకుర్తి నరసింహులు, కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి హేమచంద్ర, కార్పొరేషన్ డైరెక్టర్ బద్రీనారాయణ, కాణిపాకం ట్రస్టు బోర్డు మాజీ సభ్యులు నరసింహులశెట్టి, పామిడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

48 ఎర్రచందనం దుంగల స్వాధీనం

- నలుగురు స్మగ్లర్ల అరెస్టు



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా తంబళపల్లె అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు తనిఖీలు నిర్వహించి నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి, 48 ఎర్రచందనం దుంగలతోపాటు ఓ మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ చిరంజీవులకు చెందిన ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం స్థానిక అటవీశాఖ అధికారులు జయప్రసాద్ రావు, మోహన్‌రెడ్డి, షబీన్‌తాజ్‌లతో కలిసి తంబళ్లపల్లె పరిధిలోని బురకాయలకోట అటవీ ప్రాంతంలోని వేపూరికోట ఫారెస్టు బీటులో శనివారం తనిఖీలు చేపట్టారు. ఆదివారం తెల్లవారుజామున అన్నగారిపల్లె సమీపంలోని వంకగట్టు వద్దకు చేరుకోగా అనుమానాస్పదంగా ఓ మోటారు సైకిల్ కనిపించింది. దాన్ని పరిశీలిస్తుండగా అప్పటికే ఆ ప్రాంతంలో ఉన్న స్మగ్లర్లను గమనించారు. పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి నలుగురిని పట్టుకోగలిగారు. ఆ ప్రాంతంలో తనిఖీ చేయగా 48 ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడ్డ స్మగ్లర్లు అన్నమయ్య జిల్లాకు చెందిన వారుగా గుర్తించారు. స్మగ్లర్లతోపాటు ఎర్రచందనం దుంగలు, మోటార్ సైకిల్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.











గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సూర్య, చంద్రప్రభ వాహనాలపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవల ముందు కళాబృందాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులను భక్తిపారవశ్యానికి లోనుచేశాయి.

జవహర్ నవోదయ విద్యాలయ(జేఎన్‌వీ) సమితి 2026-27 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. సీబీఎస్‌ఈ సిలబస్‌లో బోధన ఉంటుంది. ఎంపికైన విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు ఉచితంగా బోధించడంతోపాటు, వసతి, భోజనం, పుస్తకాలు, యూనిఫారమ్ కూడా అందిస్తారు.

నవోదయ విద్యాలయలో అడ్మిషన్స్



అర్హతలు:

- **విద్యార్హత:** జేఎన్‌వీకి దరఖాస్తు చేయాలనుకునే విద్యార్థులు ప్రైవేట్ / ప్రభుత్వ / ప్రభుత్వ అనుబంధ పాఠశాలలో, 2025-26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతూ ఉండాలి.
- **వయస్సు:** విద్యార్థి 2014 మే1 నుంచి 2016 జూలై 31 తేదీ మధ్యలో(ఈ తేదీలతో సహా) జన్మించి ఉండాలి.
- **నివాసం:** విద్యార్థి ఐదో తరగతి చదువుతో పాటు, అదే జిల్లాలో నివాసాన్ని కలిగి ఉండాలి.
- **సీట్లు:** మొత్తం సీట్లను రూరల్, అర్బన్ కోటా కింద విభజిస్తారు. ప్రతి జేఎన్‌వీ పాఠశాలలో 80 సీట్లు ఉండగా గ్రామీణ విద్యార్థులకు 60 సీట్లు, నగర(అర్బన్) విద్యార్థులకు 20 సీట్లు లభిస్తాయి. గ్రామీణ కోటాలోకి రావాలంటే, విద్యార్థి 3వ, 4వ, 5వ తరగతులను పూర్తిగా గ్రామీణ ప్రాంత పాఠశాలలో చదివి ఉండాలి. ఈ కాలంలో ఒక్క రోజు నగర పాఠశాలలో చదివినా, ఆ విద్యార్థులను నగర కోటాలో పరిగణలోకి తీసుకుంటారు.
- **పరీక్ష విధానం:** పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో మొత్తం 100 మార్కులకు ఉంటుంది. ఇందులో 80 ప్రశ్నలు వస్తాయి.

విభాగం	మార్కులు	ప్రశ్నల సంఖ్య
మెంటల్ ఎబిలిటీ	50	40
గణితం	25	20
ఆంగ్లం	25	20

- పరీక్ష తరువాత ఒక ఎంపిక జాబితా విడుదల చేస్తారు.

ఎన్ని పాఠశాలలు: ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 15 పాఠశాలలు ఉన్నాయి ఇందులో 13 పాత పాఠశాలలు కాగా ఈ సంవత్సరం కొత్తగా రెండింటిని చేర్చారు. తెలంగాణ ప్రస్తుతం 9 పాఠశాలలు ఉన్నాయి. కొత్తగా ఏడు పాఠశాలలు మంజూరైనప్పటికీ ఈ సంవత్సరపు నోటిఫికేషన్‌లో వాటిని చేర్చలేదు.

- **దరఖాస్తు చివరి తేదీ:** 2025 జూలై 29
- **పరీక్ష తేదీ:** 2025 డిసెంబర్ 13
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్
- **వెబ్‌సైట్:** https://navodaya.gov.inspector

దిక్సూచి

SCHOLARSHIP ALERT

IET India Scholarship Award

Description: The Institution of Engineering and Technology (IET) invites undergraduate engineering students to showcase their creativity, innovation, and leadership. This scholarship recognizes and nurtures India's future engineering leaders, empowering them to excel.

Eligibility: Open to full-time 1st, 2nd, 3rd, and 4th-year UG engineering students from AICTE/UGC-approved institutions across all branches. Applicants must have cleared all credit courses in a single attempt with a minimum of 60% marks in aggregate (or 6.0 CGPA on a 10-point scale). There is no age limit.

Prizes & Rewards: Scholarships worth INR 10,00,000

Last Date to Apply: 22-06-2025

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/IET5

buddy4study.com

కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్

మొత్తం ఖాళీలు: 453

కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్ష కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దీని ద్వారా ఇండియన్ మిలిటరీ అకాడమి, ఇండియన్ నేవల్ అకాడమి, ఎయిర్ ఫోర్స్ అకాడమి, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీల్లో అడ్మిషన్ కల్పిస్తారు.

1. ఇండియన్ మిలిటరీ అకాడమి(ఐఎమ్‌ఏ-డెహ్రాడూన్)

- **ఖాళీలు:** 100 (13 ఖాళీలు ఆర్మీవింగ్‌లో ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ ఉన్నవారి కోసం కేటాయించారు)
- **విద్యార్హతలు:** గ్రాడ్యుయేషన్
- **వయస్సు:** 2002 జూలై 2 నుంచి 2007 జూలై1 తేదీలోపు జన్మించిన అవివాహితులైన పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.

2. ఇండియన్ నేవల్ అకాడమి(ఐఎన్‌ఏ-ఎజిమల)

- **ఖాళీలు:** 26 (6 ఖాళీలు నేవల్ వింగ్‌లో ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ ఉన్నవారి కేటాయించారు. 2 హైడ్రో కేడర్ వారికి)
- **విద్యార్హతలు:** ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్
- **వయస్సు:** 2002 జూలై 2 నుంచి 2007 జూలై1 తేదీలోపు జన్మించిన అవివాహితులైన పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.

3. ఎయిర్ ఫోర్స్ అకాడమి(ఐఎఫ్‌ఏ-హైదరాబాద్)

- **ఖాళీలు:** 32 (3 ఖాళీలు నేవల్ వింగ్‌లో ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ ఉన్నవారి కేటాయించారు.)
- **విద్యార్హతలు:** ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ లేదా ఎంపీసీతో ఇంటర్ చదివి ఏదైనా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి.
- **వయస్సు:** 2026 జూలై 1 తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 20 నుంచి 24 సంవత్సరాల మధ్యలో ఉండాలి (2002 జూలై 2 నుంచి 2006 జూలై1 తేదీలోపు జన్మించి ఉండాలి). డీసీసీఏ కమర్షియల్ పైలెట్ లైసెన్స్ ఉన్న అభ్యర్థులు అయితే 26 సంవత్సరాల వయస్సు వరకు అర్హులు.

4. ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమి(ఓటీఏ-చెన్నై)(పురుషుల నాన్ టెక్నికల్ కోర్స్)

- **ఖాళీలు:** 276 ● **విద్యార్హత:** గ్రాడ్యుయేషన్
- **వయస్సు:** 2001 జూలై 2 నుంచి 2007 జూలై 1 తేదీలోపు జన్మించిన అవివాహితులైన పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు.


5. ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమి (ఓటీఏ-చెన్నై)(మహిళల నాన్ టెక్నికల్ కోర్స్)

- **ఖాళీలు:** 19 ● **విద్యార్హత:** గ్రాడ్యుయేషన్
- **వయస్సు:** 2001 జూలై 2 నుంచి 2007 జూలై1 తేదీలోపు జన్మించిన అవివాహితులైన మహిళలు, పిల్లలు లేకుండా విడాకులు పొందిన మహిళలు/ భర్త చనిపోయిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక విధానం:

1. **రాత పరీక్ష(ఆబ్జెక్టివ్)**
   - ఐఎమ్‌ఏ, ఐఎన్‌ఏ, ఏఎఫ్ఏ: ఇంగ్లిష్, జీకే, ఎలిమెంటరీ మేథ్స్(300 మార్కులు)
   - ఓటీఏ: ఇంగ్లిష్, జీకే(200 మార్కులు)
2. **ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ(సైకలాజికల్, గ్రూప్ టెస్టింగ్, ఇంటర్వ్యూ)**

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 17
- **పరీక్ష తేదీ:** సెప్టెంబర్ 14
- **వెబ్‌సైట్:** https://upsconline.nic.in/



UPSC

నేషనల్ డిఫెన్స్ అకాడమి అండ్ నేవల్ అకాడమి

మొత్తం ఖాళీలు: 406

నేషనల్ డిఫెన్స్ అకాడమి అండ్ నేవల్ అకాడమి ఎగ్జామినేషన్ కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2026 జూలై 1 నుంచి ప్రారంభం అయ్యే ఎన్‌డీఏ 156 కోర్, ఇండియన్ నేవల్ అకాడమి 118 కోర్‌కు సంబంధించిన నోటిఫికేషన్ ఇది. ఆసక్తిగల అవివాహితులైన స్త్రీ, పురుష అభ్యర్థులు యూపీఎస్సీ ఆన్‌లైన్ అప్లికేషన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

1. నేషనల్ డిఫెన్స్ అకాడమి(ఎన్‌డీఏ) 370 పోస్టులు

- **ఆర్మీవింగ్:** 208 (మహిళలకు 10)
- **నేవీ వింగ్:** 42 (మహిళలకు 5)
- **ఎయిర్ ఫోర్స్ వింగ్:** ఫ్లైయింగ్ బ్రాంచ్ 92(మహిళలకు 2)
- **గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్):** 18 (మహిళలకు 2)
- **గ్రౌండ్ డ్యూటీ(నాన్ టెక్నికల్):** 10 (మహిళలకు 2)

2. నేవల్ అకాడమి(10+2 కేడెట్ ఎంట్రీ స్కీమ్) 36 పోస్టులు

- మొత్తం 36 పోస్టులు (మహిళలకు 4)

వయస్సు: 2007 జనవరి 2 నుంచి 2010 జనవరి 1వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలి.

విద్యార్హత: ఆర్మీ వింగ్ పదో తరగతి పాసై ఉండాలి

ఎయిర్ ఫోర్స్ అండ్ నేవల్ వింగ్/ ఎన్ఏ కేడెట్ ఎంట్రీ స్కీమ్: మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీతో ఇంటర్ పాసై ఉండాలి.

ఎంపిక విధానం:

రాత పరీక్ష: మేథ్స్ 300 మార్కులు, జీకే+ఇంగ్లిష్ 600 మార్కులు(మొత్తం 900 మార్కులు). తప్పుగా గుర్తించిన సమాధానానికి నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది.

ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ/ పర్సనాలిటీ టెస్ట్: 900 మార్కులు

ఎయిర్‌ఫోర్స్ కేడెట్స్: కంప్యూటరైజ్డ్ పైలెట్ సెలెక్షన్ సిస్టమ్(సీపీఎస్ఎస్) పాస్ కావాలి.

దరఖాస్తులకు చివరి తేదీ: 2025 జూన్ 17

పరీక్ష తేదీ: 2025 సెప్టెంబర్ 14

వెబ్‌సైట్: https://upsconline.nic.in/

సీఎస్ఐఆర్ యూజీసీ నెట్



సైన్స్ విభాగాల్లో పరిశోధన, బోధనకు అవకాశం కల్పించే సీఎస్ఐఆర్ యూజీసీ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్) నోటిఫికేషన్ వెలువడింది. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తుంది. ఇది జేఆర్ఎఫ్‌తోపాటు, అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకం, పీహెచ్‌డీ ప్రవేశాలకు ఉపయోగపడుతుంది.

పరీక్ష పేపర్లు

- కెమికల్ సైన్సెస్ ● ఫిజికల్ సైన్సెస్
- లైఫ్ సైన్సెస్ ● మేథమెటికల్ సైన్సెస్
- ఎర్త్, అట్మాస్ఫియర్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ పాసై ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీల అభ్యర్థులకు 50 శాతం చాలు.

వయస్సు: జేఆర్ఎఫ్‌కు అర్హత విషయానికి వస్తే జనరల్ కేటగిరీ అభ్యర్థులు 2025 జూలై 1 తేదీ నాటికి 30 సంవత్సరాల లోపు ఉండాలి. ఎస్సీ/ ఎస్టీ/ మహిళలు/ దివ్యాంగ అభ్యర్థులకు ఐదు సంవత్సరాలు, నాన్ క్రిమిలేయర్ ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. అసిస్టెంట్ ప్రొఫెసర్/ పీహెచ్‌డీ ప్రవేశాలకు ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు.

పరీక్ష విధానం: పరీక్ష కంప్యూటర్ బేస్డ్ విధానంలో, మల్టిపుల్ ఛాయిస్ పద్ధతిలో 200 మార్కులకు ఉంటుంది. పరీక్ష వ్యవధి మూడు గంటలు. నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1150/-, జనరల్, ఈడబ్ల్యూఎస్/ఓబీసీ(నాన్ క్రిమిలేయర్) రూ.600/-, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/థర్డ్ జెండర్ అభ్యర్థులకు రూ.325/-.

దరఖాస్తులకు చివరి తేదీ: 2025 జూన్ 23

పరీక్ష తేదీలు: 2025 జూలై 26, 27, 28

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్

వెబ్‌సైట్: https://csirnet.nta.ac.in/

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★







అంగరంగ వైభవంగా అఖిల్ రిసెప్షన్



యువ కథానాయకుడు అఖిల్ అక్కినేని వివాహ రిసెప్షన్ అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరయ్యారు. మహేశ్ బాబు, రామ్‌చరణ్ కుటుంబంతో సహా విచ్చేశారు. తమిళ హీరో సూర్యతోపాటు దర్శకుడు వెంకీ అట్లూరి హాజరయ్యారు. వీరితోపాటు పలువురు సినీ సెలబ్రెటీలు కూడా సందడి చేశారు. ఈనెల 6న అఖిల్, జైనబ్ వివాహ బంధంతో కొత్త జీవితంలోకి అడుగుపెట్టారు.

బాలకృష్ణతో మరోసారి



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా గోపీచంద్ మలినేని ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఈ విషయాన్ని దర్శకుడు గోపీచంద్ మలినేని ఎక్స్ వేదికగా పంచుకున్నారు. "గాడ్ ఆఫ్ మాసెస్ బాలకృష్ణతో మరోసారి సినిమా చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ సినిమాతో మా కాంబో చేసే గర్జన మరింత ఎక్కువగా ఉండబోతోంది. చరిత్రలో నిలిచిపోయే చిత్రమిది" అని పేర్కొన్నారు. మంగళవారం బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రారంభించనున్నారు. ఇది ఆయన నటించనున్న 111వ చిత్రం. వెంకట్ సతీష్ కిలారు నిర్మించనున్నారు. కాగా, బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కలయికలో 'వీరసింహా రెడ్డి' అనే చిత్రం వచ్చిన సంగతి తెలిసిందే.

అఖండ 2 టీజర్ వచ్చేస్తోంది

హీరో బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబో హ్యాట్రిక్ కొట్టిన సంగతి తెలిసిందే. వారి కలయికలో నాలుగోసారి తెరకెక్కుతోన్న సినిమా 'అఖండ 2: తాండవం'. ఈ సినిమా టీజర్‌ను నేడు విడుదల చేయనున్నారు మేకర్స్.

'మాగంటి'కి చిత్రపరిశ్రమతో అనుబంధం



జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా మూడు సార్లు ఎన్నికైన మాగంటి గోపీనాథ్‌కు చిత్ర పరిశ్రమతో కూడా అనుబంధం ఉంది. సినీ ప్రముఖులతో మంచి సంబంధాలు ఉన్నాయి. నిర్మాతగా నాలుగు సినిమాలు నిర్మించారు. శ్రీ సాయినాథ్ ఆర్ట్ క్రియేషన్స్ బేనర్‌పై సురేశ్, శ్రీకాంత్ కీలక పాత్రల్లో 'పాత బస్తీ' అనే సినిమాను 1995లో నిర్మించారు. అనంతరం 2000 సంవత్సరంలో ఆర్‌కే ఫిల్మ్స్ బేనర్‌పై రాజశేఖర్, కృష్ణతో 'రవన్న' అనే చిత్రాన్ని నిర్మించారు. 2004లో దివ్య అక్షర నాగ మూవీస్ బేనర్‌పై తారకరత్నతో 'భద్రాద్రి రాముడు', 2009లో రాజశేఖర్‌తో ' నా స్టైలే వేరు' సినిమాలు నిర్మించారు.



శివుడే నన్ను ఎంచుకున్నాడు

మంచు విష్ణు

విష్ణు కథానాయకుడిగా ముఖేశ్‌కుమార్ సింగ్ తెరకెక్కించిన చిత్రం 'కన్నప్ప'. డా.మోహన్‌బాబు నిర్మించారు. ఈ నెల 27న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోహన్‌బాబు మాట్లాడుతూ "దాదాపు ఏడెనిమిదేళ్లు కష్టపడి ఈ సినిమా తీశాం. ఇందులో నటించమని అడిగిన వెంటనే అంగీకరించిన మా బావ ప్రభాస్‌కు కృతజ్ఞతలు. ఈ సినిమాను శివుడు ఆశీర్వదించాడు" అని అన్నారు. "ఈ సినిమాలో ఎవరెవరు పనిచేయాలి అనేది శివాజ్ఞతోనే జరిగింది. ఈ చిత్ర ప్రయాణం నన్ను చాలా మార్చింది. 'కన్నప్ప' కథను మరోసారి చెప్పరా అని శివుడు నన్ను ఎంచుకున్నాడని భావిస్తున్నా" అని మంచు విష్ణు చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందం, రఘుబాబు, శివబాలాజీ, కౌశల్ పాల్గొన్నారు.

సరికొత్త కథాంశంతో 'పయనం'



'రోటీ కపడా రొమాన్స్' ఫేమ్ సుప్రజ్, సంగీర్తన విపిన్ జంటగా 'పయనం' అనే చిత్రంలో నటిస్తున్నారు. చందురామ్ దర్శకత్వంలో స్వర్ణకమల నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. కొరియోగ్రాఫర్ రఘు మాస్టర్ క్లాప్ ఇవ్వగా, సంగీత దర్శకుడు రఘు కుంచె కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ఈ సందర్భంగా చందురామ్ మాట్లాడుతూ "సరికొత్త కథాంశంతో తెరకెక్కుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

టీఎఫ్‌సీసీ అధ్యక్ష పదవికి

సునీల్ నారంగ్ రాజీనామా

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

ఇటీవల కాలంలో ఇండస్ట్రీలో పలు వివాదాలకూ, సంచలనాలకు కారణమైన సింగిల్ స్క్రీన్ థియేటర్ల మూసివేత అంశం తాజాగా కొత్త మలుపు తీసుకుంది. తెలంగాణ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్(టీఎఫ్‌సీసీ) అధ్యక్ష పదవికి నిర్మాత సునీల్ నారంగ్ ఆదివారం రాజీనామా చేశారు. శనివారం జరిగిన టీఎఫ్‌సీసీ ఎన్నికల్లో నారంగ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఈ పదవికి ఎన్నికవడం ఇది మూడోసారి. అయితే అధ్యక్ష పదవి చేపట్టి 24 గంటలు కూడా గడవకముందే ఆయన రాజీనామా చేయడం ఇండస్ట్రీ వర్గాల్లో సంచలనం కలిగించింది. 'నాకు సంబంధం లేకుండా నా పేరుతో పబ్లిక్ స్టేట్‌మెంట్స్ ఇస్తున్నారు. సినీ పరిశ్రమ నుంచి ఏదైనా ప్రకటన ఇచ్చేముందు, ఇంటర్వ్యూ, ప్రెస్ మీట్ నిర్వహించే ముందు నాకు సమాచారం ఇవ్వడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఇక టీఎఫ్‌సీసీ అధ్యక్షుడిగా కొనసాగలేను' అని ఆయన టీఎఫ్‌సీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. కానీ ఆయన రాజీనామా కోసం తెరవెనుక పెద్ద తతంగమే నడిచిందంటున్నాయి పరిశ్రమ వర్గాలు.

శ్రీధర్ విమర్శలపై ఇండస్ట్రీ ఆగ్రహం

కొత్త కార్యవర్గం ఏర్పాటైన సందర్భంగా శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో టీఎఫ్‌సీసీ సెక్రటరీ శ్రీధర్ టాలీవుడ్ అగ్రహీరోలను ఉద్దేశించి చేసిన పరుష వ్యాఖ్యలు ఇండస్ట్రీలోని కొన్ని వర్గాలకు రుచించలేదని సమాచారం. 'నీ ప్రోద్బలం లేకుండా నీ సమక్షంలోనే అతను అంత దురుసుగా ఎలా మాట్లాడతాడు, నువ్వు అక్కడే ఎందుకు ఖండించలేదు' అంటూ ఇండస్ట్రీ శక్తులు కొన్ని నిప్పులు చెరగడంతో ఎటూ పాలు పోని పరిస్థితుల్లో సునీల్ రాజీనామా చేశారనే మాట వినిపిస్తోంది. పవన్ కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రాన్ని అడ్డుకునేందుకే థియేటర్ల మూసివేత అంశాన్ని తెరపైకి తెచ్చారని జరిగిన ప్రచారంలో ఆ నలుగురు(అల్లు అరవింద్, దిల్‌రాజు-శిరీష్, సురేశ్‌బాబు) లో సునీల్‌నారంగ్ పేరు ప్రముఖంగా వినిపించిన విషయం తెలిసిందే. అయితే 'అందులో నేను లేను, పవన్ కల్యాణ్ సినిమా అడ్డుకునే సాహసం ఎవరూ చేయలేరు' అని శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సునీల్ నారంగ్ వివరణ ఇచ్చారు. కానీ అదే ప్రెస్‌మీట్‌లో శ్రీధర్ ఇద్దరు దర్శకులు, ఇద్దరు హీరోలు చేసిన కుట్రలో భాగమే ఇదంతా అంటూ చేసిన వ్యాఖ్యలు సునీల్ నారంగ్ మెడకు చుట్టుకున్నాయి.

పవన్ సినిమా రాకుంటే మా పరిస్థితి ఏమిటి?



శ్రీధర్

అసలు ఇంతకీ మీడియా సమావేశంలో శ్రీధర్ ఏమన్నారంటే 'వరల్డ్‌వైడ్ రూ. 2 కోట్లు వసూళ్లు రాని హీరోకి రూ. 13 కోట్లు పారితోషికం ఇచ్చారు. ఒకప్పుడు రెండు మూడు సినిమాలు చేసేవాళ్లు హీరోలు. ఇవ్వాళ రెండేళ్లకో సినిమా తీస్తున్నారు. భారీగా పారితోషికం తీసుకోవడమే దానికి కారణం. పవన్ కల్యాణ్ సినిమా వస్తుందని మేం థియేటర్లు అన్నీ ఖాళీ పెట్టుకున్నాం. ఇప్పుడు ఈ నెల మొత్తం వృథాగా పోయినట్లే. హీరోలకు ఈ స్టార్‌డమ్ ఎక్కడ నుంచి వచ్చింది. ఒక హీరో ఏడాదికి రెండు సినిమాలైనా చేయకపోతే సింగిల్ స్క్రీన్లు నడవవు. లేదంటే గోదాములు, సూపర్ మార్కెట్లు అవుతాయి. తెలంగాణ ఎగ్జిబిటర్ల నుంచి థియేటర్ల ప్రతిపాదన రాలేదు. ఇద్దరు దర్శకులు, ఇద్దరు నిర్మాతలే దీని వెనుక ఉన్నారు. టైమ్ వచ్చినప్పుడు పేర్లు చెబుతాను' అని సీరియస్ వ్యాఖ్యలు చేశారు.

హీరోలు అంటే దేవుళ్లు



సినీ పెద్దల ఆగ్రహాన్ని చల్లబరిచే ప్రయత్నంలో భాగంగానే సునీల్ నారంగ్ రాజీనామా చేశారనే ప్రచారం జరుగుతోంది. పవన్ కల్యాణ్ సినిమాతో పాటు మా కుబేర సినిమా కూడా అదే సమయంలో విడుదలవుతుండగా, మేం థియేటర్లను మూయాలని ఎందుకు అనుకుంటాం అని ప్రశ్నించారు. డిజిటల్ మీడియాకు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూల్లో సైతం ఆయన హీరోలను ఆకాశానికి ఎత్తారు. 'మనదేశంలో డబ్బున్నోళ్లు చాలామంది ఉన్నారు. కానీ హీరోలవ్వలేదు. కోటి మందిలో ఒక హీరో పుడతాడు. వాళ్లు దేవుళ్లు. హీరో అవ్వడం అంత వీజీ కాదు. 145 కోట్ల జనాభాలో 40 మంది హీరోలున్నారు' అంటూ స్పందించారు. తాజా వివాదానికి ఆజ్యం పోసిన శ్రీధర్ వ్యాఖ్యలతోనూ తనకు సంబంధం లేదని చెప్పే ప్రయత్నం చేశారు. 'శ్రీధర్ చెప్పిన మాట వినడు. నిన్న నేను ఆయన్ను చూసి వెనక్కు వెళుతుంటే బలవంతంగా తీసుకెళ్లి ప్రెస్‌మీట్‌లో కూర్చోబెట్టారు. ఆయనకు ఎవరు రాసిచ్చారో, ఆయనతో ఎవరు అలా మాట్లాడించారో నాకు తెలియదు. నేను ప్రెసిడెంట్‌ని, ఆయన సెక్రటరీ... కాబట్టి నా పక్కన కూర్చొని మాట్లాడాడు. దాంతో నాకేం సంబంధం లేదు. ఆయన మాటల వెనుక నా ప్రోద్బలం ఉండి ఉంటే మీడియా సమావేశంలో ఆయన పక్కన ఎందుకు కూర్చుంటాను. అసలు ప్రెస్‌మీట్‌లో ఆయన ఏం మాట్లాడతాడనేది కూడా నాకు తెలియదు. ఆయన మాటలతో నేను షాక్‌కు గురయ్యాను. 'హీరోలు ఎన్ని సినిమాలు చేయాలో చెప్పడానికి నువ్వెవరు' అన్నాను. ఆయనకు మాట్లాడడం రాదు. నా స్నేహితుడు అయినంత మాత్రాన ఆయన ఏం చేసినా దానికి నేను పూచీ కాదు' అని బదులిచ్చారు.

అందుకే హీరోలతో కలసి థియేటర్ల నిర్మాణం

'మల్టీప్లెక్స్‌ల్లో రెండు సినిమాలు విడుదలైతే ఒకటి ఫ్లాప్ అయినా, ఒకటి హిట్ అవుతుంది. దానికి షోలు పెంచుతాం. సేఫ్ అయిపోతాం. సింగిల్ థియేటర్‌లో వేసిన సినిమా ఫ్లాప్ అయితే ఇక ఏం చేయలేం. అందుకే టాలీవుడ్ అగ్రహీరోలతో కలసి థియేటర్ల నిర్మాణం చేపట్టాం. అది భాగస్వామ్య వ్యాపారం. అందులో తప్పేం ఉంది. ప్రాజెక్ట్‌కి క్రేజ్ వస్తుంది. అలాంటి ఆలోచనతో ఇంకెవరూ వెళ్లలేదు. మేం వెళ్లాం. వాళ్లు ఓకే చేశారు. ఆ స్టార్‌కి కూడా లాభం ఉంటుంది. పైగా ఇలాంటి మల్టీప్లెక్స్‌లు పది కట్టుకుంటే 'ఆ నలుగురు', గుత్తాధిపత్యం లాంటి నిందలు అన్నీ పోతాయి' అన్నారు.

పుత్తూరు

చిన్న శేష, హంస వాహనాలపై వెంకన్న విహారం




వడమాలపేట,జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయ గుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్స వాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజు ఆదివారం ప్రసన్న వేంకటేశ్వరుడు సాయంత్రం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనాలపై మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. సాయంత్రం ప్రసన్న వేంకటేశ్వరుడు సర్వాలంకారం భుషితుడై ఐదు తలల చిన్నశేష వాహనంపై మోహనకృష్ణుడి అలంకారంలో మేళతాలాలు, మంగళ వాయిద్యాలు నడుమ మాడవీదుల్లో ఊరేగుతూ భక్తులపై వరాల జల్లు కురిపించారు. అనంతరం సాయంత్రం భక్తుల గోవిందనామ స్మరణల నడుమ శ్రీవారి ఊంజల సేవ నిర్వహించారు. రాత్రి స్వామివారు హంస వాహన రూఢుడై సరస్వతీదేవి అలంకారంతో భక్తుల గోవిందనామ స్మరణల నడుమ మాడ వీధుల్లో ఊరేగారు. భక్తులు నారికేళ కర్పూర నీరాజనాలు సమర్పించారు.

● మాడవీధుల్లో ఒకరు కాలం చెందడంతో బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు కార్యక్రమాలు ఆలస్యంగా ప్రారంభించారు. మధ్యాహ్నం తరువాత మాడవీధులు, ఆలయంలో సంపూర్ణ సంప్రోక్షణ, హోమాదికాలు నిర్వహించి యాథాతథంగా ఊంజల సేవ, వాహన సేవలు నిర్వహించారు. ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, కంకణ భట్టార్ తిప్పయ్యాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి వాహన సేవలు

అప్పలాయగుంటలో మూడోరోజు సోమవా రం ఉదయం 8.00 నుంచి 9.00గంటల వరకు సింహ వాహన సేవ, సాయంత్రం 5.00 నుంచి 5.30 గంటల వరకు శ్రీవారి ఊంజల సేవ, రాత్రి 7.00 నుంచి 8.00 వరకు ముత్యపు పందిరి వాహనంపై శ్రీవారు మాడవీధుల్లో విహరించనున్నారు.

నేడు ఎన్టీఆర్, ముద్దుకృష్ణమ విగ్రహాల ఆవిష్కరణ




పుత్తూరు అర్బన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం ఎన్టీఆర్, మాజీ మంత్రి ముద్దుకృష్ణమ విగ్రహాలను సోమవారం ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆవిష్కరించను న్నారు. ముద్దుకృష్ణమ 79వ జయంతిని స్థానిక అన్న క్యాంటీన్ వద్ద సోమవారం ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్నారు. అలాగే అక్కడ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్, ముద్దుకృష్ణమ విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు పేర్కొన్నారు.

టీ-టెన్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

వడమాలపేట,జూన్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఢిల్లీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఓపెన్ టూ ఆల్ టీ-టెన్ క్రికెట్ టోర్నీ ప్రారంభించారు. సుమారు 40 జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి. విజేతలకు రూ.33,333, రన్నర్ అప్‌కు రూ.22,222 , మూడో బహుమతిగా రూ.7,777, నాల్గో బహుమతిగా రూ.5,555 సహా వ్యక్తిగత బహుమతులు అందిస్తామని టోర్నీ నిర్వాహకులు ఉదయ్, భాస్కర్ రెడ్డి, పవన్, సునీల్, పాండు చెప్పారు. పది రోజులు పాటు టోర్నీ జరగనుంది.

కదలని మురుగు... తప్పని ఇబ్బందులు



పుత్తూరు అర్బన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కాలువల్లో మురుగు కదలక రోడ్లపై పారుతోంది. కాలువల నిర్వహణ విషయంలో మున్సిపల్ పారిశుధ్య విభాగం సిబ్బంది తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో ప్రజలు దుర్వాసనతో ఇబ్బంది పడుతు న్నారు. ఆనంబట్టు రోడ్డులో మురుగునీటి కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీనిపై స్థానికులు మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. ఇటీవల జిల్లా కలెక్టర్ పారిశుధ్య కార్మికుల హాజరు, పనితీరుపై హెచ్చరించారు. అయినా ఆ విభాగ సిబ్బందిలో మార్పు కనిపించడం లేదనడానికి ఇక్కడ నిల్వ ఉన్న మురుగే నిదర్శనం. సిబ్బంది కొరత పేరుతో మురుగు తొలగించడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండం



పాతవీరాపురంలో అగ్నిగుండ ప్రవేశం -



ధర్మరాజస్వామికి ప్రత్యేక పూజలు

ఏర్పేడు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతవీరాపురంలో ద్రౌపది సమేత ధర్మరాజ స్వామి వార్షిక ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం అగ్నిగుండ ప్రవేశం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుమారు వెయ్యి మందికి పైగా భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పిచ్చాటూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడియూరు పంచాయతీలో అద్దాలమేడ గ్రామంలో అంకాళపరమేశ్వరి కొలుపు ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. చివరి రోజున ఆదివారం అగ్నిగుండ ప్రవేశం జరిగింది. గత మూడు రోజుల నుంచి కాపు కట్టుకున్న భక్తులు 9 బావుల్లో అభ్యంగన స్నానాలు చేసి పసుపు దుస్తులు ధరించి గోవిందా...గోవిందా... నామస్మరణ చేస్తూ నిప్పు కణికలపై అగ్నిగుండ ప్రవేశం చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి మేళతాళాలు భారీ బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ఎమ్మెల్యే విజయశ్రీ మానవత

నాయుడుపేట టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళను తన కాన్వాయ్ వాహనంలో ఎక్కించుకొని ప్రభుత్వ వైద్యశాలలో చేర్చి ఎమ్మెల్యే విజయశ్రీ మానవత్వం చాటుకున్నారు. వివరాలలోకి వెళ్లితే... ఆదివారం నాయుడుపేట-చెన్నై జాతీయ రహదారి వద్ద ఎమ్మెల్యే కాన్వాయ్ వస్తుండగా చిల్లకూరు మండలం బూదనం గ్రామానికి చెందిన రాజశేఖర్-భవానీ దంపతులు మోటారు సైకిల్‌పై వస్తూ డివైడర్‌ను ఢీ కొన్నారు. ఈ సంఘటనను గుర్తించి ఎమ్మెల్యే తన వాహనాన్ని ఆపారు. తీవ్రంగా గాయపడిన భవానీని కాన్వాయ్‌లో డీఎస్పీ వాహనంలో ఎక్కించుకుని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. వైద్యసేవలు అందించేలా చూశారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

పెళ్లకూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పేకాటస్థావరాలపై పోలీసులు దాడిచేసి పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ ఘటన ఎర్రగుంట గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు ఎర్రగుంట గ్రామసమీపంలో ఖాళీస్థలంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు పేకాటస్థావరాలపై దాడులు జరిపి పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నాలుగు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు, 3,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వరదయపాళెం మండలం రాచకండ్రిగ గ్రామానికి చెందిన చిన్నకుమార్ బంధువులతో కలిసి సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయంలో వేడుకలకు ఒకే బైక్‌పై వస్తున్నారు. కొండూరు జాతీయ రహదారి వద్ద పశువులు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. అదే దారిలో నెల్లూరు వైపు వెళ్తున్న కారు సడన్ బ్రేక్ వేయడం, ఆ వెనుకే మరోకారు ఈ కారును ఢీ కొన్నాయి. ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు స్వల్పగాయాలయ్యాయి. రెండు కార్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. వెంటనే స్థానికులు గాయపడ్డవారిని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గురుకుల సీట్లు ఖరారు చేసుకోవాలి

కోట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఈ ఏడాది ఇంటర్, పదోతరగతుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు సీట్లు ఖరారు చేసుకోవాలని గురుకులాల డీసీవో గీత సూచించారు. లేకపోతే రద్దవుతాయని ఆమె పేర్కొన్నట్లు ఆదివారం స్థానిక ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. 5వ తరగతిలో కూడా సీట్లు పొందిన వారు కూడా ఖరారు చేసుకోవాలన్నారు. పలు అంబేడ్కర్ గురుకులాలకు చెందిన 12 మంది విద్యార్థులు ఈ ఏడాది ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారని తెలిపారు.

23న ఒలంపిక్ రన్



ప్రసన్నకుమార్‌ను సన్మానిస్తున్న సంఘ ప్రతినిధులు

తిరుపతి(క్రీడలు), జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఒలంపిక్ డేను పురస్కరించుకుని ఈ నెల 23వ తేదీన ఒలంపిక్ రన్ నిర్వహించనున్నట్లు ఒలంపిక్ జిల్లా అధ్యక్షుడు వై.ప్రవీణ్, కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. ఆదివారం ఉదయం చంద్రగిరి మండలం మిట్టపాలెం గ్రామంలోని శ్రీనివాస హోటల్లో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఒలంపిక్ రన్‌ను విజయవంతం చేసేందుకు సహకరించాలని క్రీడా సంఘాలను కోరారు. ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ క్రీడా సంఘాల ఆధ్వర్యంలో త్వరలో ఓ స్పోర్ట్స్ స్కూల్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం ప్రసన్నకుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సాయికుమార్, ఉపాధ్యక్షులు శివప్రసాద్, సహాయ కార్యదర్శి విజయ్‌కుమార్, రత్నాకర్, గోపినాయుడు, శివయ్య, ప్రేమ్ , శ్రీధర్, హిమత్ పాల్గొన్నారు.

తిరుపతి రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

తిరుపతి(సెంట్రల్), జూన్8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఆదివారం తెల్లవారుజామున ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేశారు. వేసవి సెలవుల కారణంగా రైల్వేస్టేషన్ కొన్ని రోజులుగా ప్రయాణికులతో రద్దీగా ఉంటోంది. ఈ క్రమంలో గంజాయి అక్రమ రవాణా జరిగే అవకాశముంటుందనే అనుమానంతో తనిఖీలు చేపట్టారు. పార్సిల్ కార్యాలయం, లగేజీ కేంద్రంతో పాటు ఆరు ప్లాట్‌ఫారాలు, విశ్రాంతి గదులు, రాకపోకలు నిర్వహించే ఎక్స్‌ప్రెస్ రైళ్లను పోలీసులు, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో జీఆర్‌పీ సీఐ ఆశీర్వాదం, ఎస్‌ఐ ధర్మేంద్ర, ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ రాజేంద్ర పాల్గొన్నారు.

మహిళల మండిపాటు

తిరుపతి, జూన్8(ఆంధ్రజ్యోతి) : అమరావతిని వేశ్యల రాజధానిగా, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులతో నిండిన ప్రాంతంగా దిగజారుడు వ్యాఖ్యలు చేసి రాజధాని ప్రాంత మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన జర్నలిస్ట్ కృష్ణంరాజు, వంతపాడిన యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావులను తక్షణం అరెస్టు చేయాలని తిరుపతి కూటమి మహిళలు డిమాండు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ ఆధ్వర్యంలో ఆదివారం పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట మహిళలు వారి చిత్రపటాలపై చెప్పులు, చీపుర్లతో కొట్టి నిరసన తెలిపారు

నీటి పథకాలకు నిధుల గలగల

మున్సిపాలిటీలో తీరనున్న తాగునీటి ఇక్కట్లు

సూళ్లూరుపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తాగునీటి కష్టాలు తీరనున్నాయి. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయిన తాగునీటి పథకాల పనులు పట్టాలెక్కనున్నాయి. 2014-2019లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆసియా మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల బ్యాంకు (ఏఐబీ) నిధులతో తాగునీటి పథకాలను చేపట్టింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ నిధులను దారిమళ్లించింది. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పనులు నిలిచిపోయాయి. గతేడాది అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం తిరిగి పనులనుపై దృష్టి సారించింది. అర్బన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యుఐడీఎఫ్) సాయంతో అమలుకు సిద్ధమైంది. సూళ్లూరుపేటకు రూ.164.14 కోట్లు, నాయుడుపేటకు రూ.125.44 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.



మంగళంపాడు చెరువులో అసంపూర్తిగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు



మన్నారుపోలూరులో అసంపూర్తిగా ట్యాంకు

పెరిగిన వ్యయం: వైసీపీ హయాంలో ఐదేళ్లుగా తాగునీటి పథకాల విస్తరణ పనులు నిలిచిపోవడంతో నిర్మాణ వ్యయం పెరిగింది. కొత్త రేట్ల ప్రకారం పబ్లిక్ హెల్త్ శాఖ అంచనాలను రూపొందించింది. చెరువుల ఆధునికీకరణ, పైపులైన్ల నిర్మాణం, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, నీటి శుద్ధిప్లాంట్ల విస్తరణ వంటి పనులు చేపట్టనున్నారు. మంగళంపాడు చెరువులో 2 వేల ఎంఎల్ సామర్థ్యంతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించనున్నారు. అక్కడే ఓవర్ హెడ్ ట్యాంకు, మన్నారుపోలూరులో మరో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించనున్నారు. అక్కడ నుంచి పైపు లైన్ల ద్వారా ట్యాంకు నింపి పట్టణానికి తాగునీరందించనున్నారు. నాయుడుపేట జువ్వలపాలెం చెరువులో 1,417 ఎంఎల్ సామర్థ్యంతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించనున్నారు.

వైసీపీ నిర్లక్ష్యం: టీడీపీ హయాంలో తాగునీటి పథకాల విస్తరణకు ఏఐబీ నుంచి విడుదలైన నిధులు రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు జమయ్యాయి. తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం వాటా ధనం విడుదల చేయలేదు. ఏఐబీ నిధులనూ వాడేసుకుంది. ఫలితంగా తాగునీటి పథకాల విస్తరణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు ఈపనులపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టారు. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చేలా చొరవ తీసుకున్నారు.

మహిళల పట్ల అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి

సూళ్లూరుపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అమరావతి ప్రాంత మహిళలకు సంబంధించి సాక్షి ఛానల్ చర్చలో కొందరు వ్యాఖ్యలు దారుణమని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. జర్నలిస్టు కృష్ణంరాజు, సాక్షి ఛానల్‌పై టీడీపీ నాయకులతో కలిసి ఆదివారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ చంద్రబాబు అమరావతిని అభివృద్ధి చేస్తుంటే వైసీపీ విష ప్రచారం చేస్తోందని విమర్శించారు. వైసీపీ అధినేత జగన్ ఆరంభం నుచంఢ సాక్షి ఛానల్‌లో తప్పుడు ప్రచారాలు చేయిస్తున్నారన్నారు. మహిళలను కించపరిస్తే సాక్షి ఛానల్, పేపరును బహిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు, కొక్కు శంకరయ్య, వెంకటేశ్వర్లు, రాజ సులోచనమ్మ పాల్గొన్నారు.



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులు



ఫిర్యాదు చేస్తున్న వెంకటగిరి నేతలు

వెంకటగిరి: అమరావతి మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ ఆదివారం కూటమి ఆధ్వర్యంలో మహిళలు, ఆ పార్టీ కీలక నేతలు ఆదివారం వెంకటగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు స్టేషన్ వద్ద కొంత సేపు నిరసన వ్యక్తం చేశారు. కూటమి నేతలు పులికొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, పునుగోటి విశ్వనాథనాయుడు, పప్పు చంద్రమౌళి రెడ్డి, మంకు ఆనంద్, చంద్రారెడ్డి, కాపా శ్రీనివాసులు నాయుడు, చంగారావు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: మాజీ సీఎం జగన్ ప్రోత్సాహంతోనే కొందరు నీచమైన వ్యాఖ్యలు చేస్తున్నారని తెలుగు మహిళా నాయకులు ఆరోపించారు. మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. మట్టం శ్రావణి, గుండాల లీలావతి, శ్రీదేవి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

చిట్టమూరు: బాధ్యత గల జర్నలిస్టు మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్యని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు ఖండించారు. చిట్టమూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కృష్ణంరాజు, శ్రీనివాసరావు, సాక్షి టీవీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు.

మేనకూరు దారిలో ముప్పుతిప్పలు



నాయుడుపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట మండలం సెజ్ బైపాస్‌రోడ్డు మేనకూరు వద్ద గుంతలమయంగా తయారైంది. అధ్వానంగా ఉన్న సెజ్‌రోడ్డులో పరిశ్రమలకు రాకపోకలు సాగించే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దాదాపు 4500 ఎకరాలలో చిన్నతరహా, మధ్యతరహా, భారీ పరిశ్రమలు ఇక్కడి సెజ్‌లో ఉన్నాయి. పరిశ్రమలకు ముడిసరుకుల రవాణాకు, ఉత్పత్తులు గమ్యస్థానాలకు చేరవేతకు నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రాధాన్యత కలిగిన సెజ్ బైపాస్‌రోడ్డు అస్తవ్యస్తంగా ఉండటంతో ఇబ్బందులెదురవుతున్నాయి. అధికారులు బైపాస్‌సెజ్ రోడ్డుకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.

లేత జొన్నగడ్డి తిని నాలుగు ఆవులు, రెండు గేదెల మృతి

● పక్వానికి రాకపోవడంతో విషంగా మారిన గడ్డి

తిరుపతి రూరల్, జూన్8(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామంలో పక్వదశకు చేరని లేత జొన్నగడ్డిని దాణాగా తీసుకుని ఆదివారం నాలుగు ఆవులు, రెండు గేదెలు మృతిచెందాయి. బాధితులు చెంచమ్మ, నాగరాజు దంపతుల వివరాల మేరకు.. పొలంలో సాగుచేస్తున్న జొన్నని శనివారం పశువులకు దాణాగా వేశారు. నీరు తాగిన కొంతసేపటికే మృతి చెందాయి. పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ మదన్, స్థానిక వెటర్నరీ డాక్టర్ యోగానంద్ వచ్చి పరిశీలించారు. పక్వానికి రాని (ఇమెచ్యూర్ జోవార్) జొన్నగడ్డిని దాణాగా తీసుకోవడం వల్ల దానిలోని హైడ్రోజన్ సయినైడ్ విషంగా మారి పశువులు మృతిచెందినట్లు నిర్ధారించారు. వీటి విలువ రూ.4.70 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. జొన్నగడ్డి పక్వానికి వచ్చిన తర్వాత, దాన్ని కోసి ఒకరోజు నీడలో ఆరబెట్టాలని, మాగుడు గడ్డిగా మారిన తర్వాతనే దాన్ని పశువులకు దాణాగా వేయాలని సూచించారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగూరు శ్రీనివాసులు ద్వారా సమాచారం తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని బాధిత రైతులతో ఫోన్‌లో మాట్లాడి ఓదార్చారు. కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, రూరల్ తహసీల్దార్ రామాంజులు నాయక్‌తో ఫోన్లో మాట్లాడి వివరించారు. వీటిలో రెండు ఆవులు గర్భం దాల్చి ఉండడంతో సంప్రదాయం ప్రకారం గ్రామస్తుల సమక్షంలో పంచనామా చేసి, గుంతలో పూడ్చిపెట్టారు. వీఆర్వో పుల్లూరు రాఘవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రెడ్డి జ్యోతీశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

సర్వజన హితానికి జగన్నాథ రథయాత్ర



ప్రచార ప్రతులను ఆవిష్కరిస్తున్న సుఖ్‌దేవ్ తదితరులు

సూళ్లూరుపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అందరి శ్రేయస్సు కాంక్షిస్తూ పట్టణంలో ఈ నెల 28న జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నట్లు నెల్లూరు ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షుడు సుఖదేవ్ మహారాజ్ తెలిపారు. ఆదివారం కాపు వీధి ఇస్కాన్ మందిరంలో జగన్నాథ రథయాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరు ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో సూళ్లూరుపేటలో మూడోసారి రథయాత్ర చేస్తున్నామన్నారు. తమిళనాడు, తెలంగాణతో ఇతర రాష్ట్రాల వక్తలు పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తారన్నారు. . దాదాపు 30 వేల మందికి పైగా రథయాత్రలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. భగవద్గీత పై ప్రచారం, సనాతన ధర్మం గురించి ప్రజలకు తెలియజేయడమే కాకుండా వ్యక్తి వికాసం అందరి మంచి కోరుతూ రథయాత్ర చేస్తున్నామన్నారు. అనంతరం హరేరామ సంకీర్తనలతో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రథయాత్ర ఇన్‌చార్జి వెంకటరమణా రెడ్డి, శ్రీనివాసులు, పవన్‌కుమార్, రాజశేఖర్ దాస్, డీపీఎస్ గిరిత పాల్గొన్నారు.

10 వరకు సచివాలయంలో పలు సేవల నిలుపుదల

రేణిగుంట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి 10వ తేది వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో పలు సేవలు నిలుపుదల చేశారు. విజయవాడలోని గ్రామ, వార్డు సచివాలయ శాఖ నిర్వహిస్తున్న ఏపీ సేవ పోర్టల్‌ను, మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్ నుంచి ఏపీ రాష్ట్ర డేటా సెంటర్‌కు తరలింపు చేపడుతుండడంతో సేవల్లో అంతరాయం కలగనుంది. ఆదాయ ధ్రువీకరణ, సమగ్ర ధృవీకరణ పత్రం, భూ మ్యూటేషన్, రైస్ కార్డులు, ఇళ్ల పట్టాలు, వృద్ధాప్య ధ్రువీకరణ పత్రాలు, రెవెన్యూ, వాటర్ ట్యాక్స్ పట్టణ పరిపాలన సంబంధిత సేవలు, మత్స్య శాఖ సేవలు మినహా మిగిలిన ఇతర ప్రభుత్వ సేవలు మీసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని ఈవోపీఆర్డీ ప్రభురావు తెలిపారు.





కళాకృతుల ఆధ్యాత్మిక విందు

తిరుపతిలోని గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సూర్య, చంద్రప్రభ వాహనాలపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవల ముందు కళాబృందాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులను భక్తిపారవశ్యానికి లోనుచేశాయి.

షైనింగ్ స్టార్ అవార్డులకు విద్యార్థుల ఎంపిక


తులసి - విజయ్ - స్పందన

ఏర్పేడు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ఏడుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డు అందుకోనున్నారు. టెన్త్ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన వారికి షైనింగ్ స్టార్ అవార్డులను ప్రదానం చేయనున్న విషయం విదితమే. ఈక్రమంలో తిరుపతి మహతి ఆడిటోరియంలో సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్ అవార్డులను ప్రదానం చేయనున్నారు. అవార్డులకు పాపానాయుడుపేటలోని ప్రైవేటు విద్యాసంస్థ బాపూజీ నుంచి ఆరుగురు విద్యార్థులు, పల్లం జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఒకరు ఎంపికయ్యారు. పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలనుంచి ఎంపికైన తులసి 540 మార్కులు సాధించింది. ఆమెను ఎంఈవోలు దయాకర్, ప్రేమలత, ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ అభినందించారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ఆరుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్స్‌కు ఎంపికయ్యారు. వీరిలో ఇద్దరు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన వారు కాగా, మరో నలుగురు ప్రైవేటు విద్యా సంస్థలకు చెందినవారు. పిచ్చాటూరు జడ్పీ హైస్కూలు విద్యార్థులు ఎం.విజయ్(562), ఎం.స్పందన (533), వెంగళత్తూరులో ఉన్న శ్రీసాయిరాం విద్యాలయానికి చెందిన యశ్వంత్ కృష్ణ, రిషిక్, ధనుష్, కీర్తన అవార్డులు అందుకోనున్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

శ్రీకాళహస్తి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లో చేరాలని ప్రధానోపాధ్యాయులు గోపి అన్నారు. ఆదివారం ఓబులాయపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆధ్వర్యంలో ఎర్రమరెడ్డిపల్లి, రెడ్డిపల్లి, ఓబులాయపల్లె గిరిజనకాలనీలో ఇంటింటా తిరిగి ప్రభుత్వ పాఠశాల్లో ఉచితంగా మధ్యాహ్న భోజనం, తల్లికి వందనం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్‌లు వంటివి ఉచితంగా అందజేస్తారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అనంతరం ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 16మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు కల్పించారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కుంభాభిషేకం



ఏర్పేడు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేటలో వళ్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆల రాజగోపుర ప్రతిష్ఠాపన, మహాకుంభాభిషేక మహోత్సవం ఆదివారం శాస్త్రోక్తంగా జరిగింది. సుబ్రహ్మణ్యస్వామి, వళ్లీ, దేవసేన విగ్రహాలను వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ఠించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు.

వైద్య శిబిరానికి స్పందన



ఏర్పేడు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతవీరాపురం లో ఆదివారం ధర్మరాజస్వామి అగ్నిగుండ మహోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయానికి విచ్చేసిన భక్తులకు రష్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్సీ రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం స్వయంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ మంజుల, ఆలయ చైర్మన్ కృష్ణారెడ్డి, మునిరంగారెడ్డి, మునిరత్నంరెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఫార్మర్ సమావేశానికి దశరథాచారి హాజరు



శ్రీకాళహస్తి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని తొట్టంబేడు ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ జి.దశరథాచారి కోరారు. విజయవాడలో కేఎల్ యూనివర్శిటీ ఆడిటోరియంలో మహి ఫౌండేషన్, వారాహి ఫెడరేషన్ ఆధ్వర్యంలో దేశంలోని రైతు ఫెడరేషన్లు, ఫార్మర్ ప్రొడ్యూసర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పట్టణానికి చెందిన జి.దశరథాచారి హాజరయ్యారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర, అధునాతన పరికరాలు, కోల్డ్ స్టోరేజీ, మార్కెటింగ్, సేల్స్ అవుట్‌లెట్లు, కిసాన్ క్రెడిట్‌కార్డులు వంటి అంశాలపై సదస్సులో ఆయన ప్రస్తావించారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

శ్రీకాళహస్తి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నగరివీధిలో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆదివారం వృద్ధులు, దివ్యాంగులు, ప్రత్యేక ప్రతిభావంతులకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను పంపిణీ చేసింది. న్యాయవాది గరికపాటి రమేష్‌బాబు, సంస్థ వ్యవస్థాపకుడు మునీర్ బాషా, సభ్యులు పాల్గొన్నారు.

ఊపందుకున్న వరి సాగు


నాట్లలో కూలీలు - పైరులో పిచికారీ

కేవీబీపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ మొదలు కావడంతో మండలంలో వరి సాగు జోరందుకుంది. ట్రాక్టర్లు, నాగళ్లతో పొలాలు దమ్ము చేయడం.. నారు తీయడం, నాటటం చేస్తున్నారు. అనంతరం క్రిములు సోకకుండా రైతులు పిచికారీ చేసే పనుల్లో నిమగ్నమయ్యారు.ఈ సీజన్‌లో ఇప్పటికే 400 హెక్టార్లలో వరి సాగు జరిగింది. అయితే అడపాదడపా కురుస్తున్న వర్షాలకు చెరువులకు నీరు తోడవడంతో రైతులు వరి సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ యేడాది వ్యవసాయాధికారుల అంచనా ప్రకారం 550 హెక్టార్ల వరకు వరి సాగు వేయవచ్చని అంటున్నారు. ఆగస్టు వరకు ఖరీఫ్ సీజన్ ఉండటంతో వచ్చే రెండు నెలల్లో వర్షాలు కురిస్తే ఇది పెరిగే జరిగే అవకాశం ఉందంటున్నారు. వరిసాగు ప్రారంభం కావడంతో గతంలో మహిళలకు నాట్లు వేయడానికి డిమాండ్ ఉండేది. ప్రస్తుత పరిస్థితుల్లో వేరే రాష్ట్రాల నుంచి మగవారే నాట్లు వేయడానికి రావడంతో కొంతవరకు మహిళలకు డిమాండ్ తగ్గింది. కూలీలు కూడా రైతులతో ముందుగానే మాట్లాడుకుని ఎకరానికి రూ.4,700 చొప్పున కాంట్రాక్టు చేసుకుని నాట్లు వేస్తున్నారు. దీంతో రైతులకు కూడా కూలీలు అందుబాటులో ఉండటంతో ఊరట లభించింది.



మహిళలపై దారుణ వ్యాఖ్యలు క్షమించరాని నేరం


పోలీస్‌స్టేషన్ వద్ద తెలుగు మహిళలతో రిషితారెడ్డి - సత్యవేడు, వరదయ్యపాళెంలలో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మహిళలపై జర్నలిస్టు కృష్ణంరాజు చేసిన దారుణ వ్యాఖ్యలు క్షమించరాని నేరమని ఎమ్మెల్యే సుధీర్ సతీమణి రిషితారెడ్డి అన్నారు. శ్రీకాళ హస్తి 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం తెలుగు మహిళలతో కలిసి జర్నలిస్టు కృష్ణంరాజుపై సీఐ గోపికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... భారతదేశంలో స్త్రీలను దేవతలుగా పూజిస్తారన్నారు. అలాంటిది మన రాష్ట్రంలో రాజకీయ కక్షలతో మీడియా విశ్లేషణ పేరుతో నిసిగ్గుగా ఏకంగా తల్లులు, చెల్లెళ్లపై దారుణ వ్యాఖ్యలు చేయడం క్షమించ రాని నేరమన్నారు. సాక్షి చానెల్‌లో విశ్లేషకుడు కృష్ణంరాజు మహిళలను కించపరిచే విధంగా మాట్లాడడం తగదన్నారు. ఏపీ రాజధాని అమరావతిని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించాలని మహిళా రైతులు తమ భూములను స్వచ్ఛందంగా ప్రభుత్వానికి ఇచ్చారని గుర్తు చేశారు. అలాంటి త్యాగాలు చేసిన మహిళల పట్ల కృష్ణంరాజు అసభ్యంగా, అగౌరవంగా అమరావతి వేశ్యల రాజధాని అని మాట్లాడడం బాధాకరమన్నారు. దీనికి వైసీపీ భవిష్యత్తులో మూల్యం చెల్లించక తప్పదన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిని వేశ్యల రాజధాని అంటూ అసభ్యకర పద జాలంతో అనుచిత వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి కోరారు. రాజధాని అమరావతిని, అమరావతి మహిళలను శీలహననం చేసేలా సాక్షి చానెల్ డిబేట్లో జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలపై ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ రామస్వామికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాజధాని నిర్మాణంపై దుష్ప్రచారం చేయడం తగదన్నారు. ఇటువంటి వారు జర్నలిజంలో ఉంటే సమాజానికి ప్రమాదకరమన్నారు. దీనిపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, మహిళా కమిషన్లు, రాష్ట్రప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పరమశివం, కావేరి, శశిమోహన్ నాయుడు, రవి, ఆనందయ్య, గురుమూర్తి, సురేంద్రనాథరెడ్డి, ధన, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): మహిళల ఆత్మ గౌరవాన్ని కించపరచిన జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావును వెంటనే అరెస్టు చేయాలని టీడీపీ నాయకులు, జనసేన వీరమహిళలు వరదయ్యపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహిళా సమాజాన్ని కించపరుస్తూ, వేశ్యలుగా వర్ణిస్తూ, వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రసారం చేసిన సాక్షి చానెల్ మూసివేయాలని డిమాండ్ చేశారు. సభ్య సమాజం తలదించుకునేలా రాష్ట్ర రాజధాని అమరావతిని వేశ్యల రాజధానిగా మాట్లాడం సరికాదన్నారు. వారిని వెంటనే అరెస్టు చేయాలని ఎస్‌ఐ మల్లికార్జున్‌కు ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకులు జయచంద్రనాయుడు, శ్రీనివాసులునాయుడు, నిర్మల్, హరిప్రసాద్ చౌదరి, తెలుగు మహిళ మునిభూషణమ్మ, జనసేన వీర మహిళ నబిహాబాను తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ప్రదోష నంది సేవ



శ్రీకాళహస్తి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ప్రదోష నందిసేవ శాస్త్రోక్తంగా జరిగింది. ముందుగా ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను మంగళవాయిద్యాలు, మేళతాళాలు, వేదమంత్రాల నడుమ నందిపై అధిష్ఠింపజేశారు. ఆలయ ప్రాకారంలో ప్రదోష నందిసేవ నిర్వహించారు. ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్



శ్రీకాళహస్తి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరు డిని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ రబిశంకర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆగమోక్తంగా బాలాలయ పూజలు


పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయమైన మూడో మాడ వీధిలోని ఆగ్నేయ గణపతి ఆలయంలో ఆదివారం రెండో రోజు బాలాలయ పూజలను ఆగమోక్తంగా నిర్వహించారు. ముందుగా కలశాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు కరుణాకర్‌గురుకుల్, సంబంధం గురుకుల్, ఉప ప్రధానార్చకులు రాముస్వామి, దక్షిణామూర్తి, అర్చకులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నీ విజేత కారూరు

వరదయ్యపాళెం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచెర్ల పంచాయతీలో అంబేడ్కర్ క్రికెట్ టోర్నమెంట్ పది రోజులుగా జరుగుతోంది. సుమారు 30 జట్లు తలపడ్డాయి. తుదిపోరులో కారూరు, కదూరు తలపడగా కారూరు విజయం సాధించింది. విజేతకు రూ.30,116, కదూరుకు రూ.20,116 బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బందిల సురేష్, సురేష్, రమేష్, జయశంకర్, జయశ్యామ్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడి మృతి



రేణిగుంట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందినట్లు రేణిగుంట స్టేషన్ రైటర్ చలపతి తెలిపారు. శనివారం సాయంత్రం కరకంబాడి - తిరుపతి ప్రధాన రహదారిలో వెంకటాపురం వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వృద్ధుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనింది. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించగా అప్పటికే వృద్ధుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆదివారం సమాచారం అందడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పద్మానగర్‌లో కార్డన్ సెర్చ్



రేణిగుంట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీపాళెం పంచాయతీలోని పద్మానగర్‌లో గాజులమండ్యం పోలీసులు కార్డన్ సర్చ్ నిర్వహించారు. ఆదివారం సాయంత్రం పద్మానగర్‌లో ప్రతి ఇంటిని జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 14 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఐ మంజునాథ్ రెడ్డి, ఏర్పేడు సీఐ శ్రీకాంత్ రెడ్డి, ఎస్‌ఐ సుధాకర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ ప్రారంభం

శ్రీకాళహస్తి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ఎమ్మెల్యే సుధీర్ ఆదివారం ప్రారంభించారు. పెట్రోల్‌బంకు యజమాని, టీడీపీ సీనియర్ నాయకులు కొన్నలి రమేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తొట్టంబేడు మండల అధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు, రంగినేని చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గరిమెళ్ల రాధ మృతి



తిరుపతి, జూన్8(ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ సంగీత కళాకారుడు, టీటీడీ ఆస్థాన విద్వాంసుడు దివంగత గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ సతీమణి రాధ ఆదివారం మృతి చెందారు. మూడు నెలల క్రితం గరిమెళ్ల అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. అనతికాలంలోనే ఆమె కన్నుమూయడంతో గరిమెళ్ల కుటుంబ సభ్యులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.